సోమవారం
MONDAY
5-10-2026
సంపుటి: 2 Volume:2 ‖ సంచిక: 97 Issue: 97
జగిత్యాల JAGITIAL ‖ పేజీలు: (PAGES):8 వెల (PRICE): 2.00
Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక
www.evarthalu.com

అరచేతిలో ఈవార్తలు దినపత్రిక
స్కాన్ చేయండి..
ఆండ్రాయిడ్ యాప్
డౌన్‌లోడ్ చేసుకోండి..
GET IT ON Google Play

## రాజ్యాంగ ఆత్మపై దాడి

### కోట్లాది ఓట్ల తొలగింపు సరికాదు

### సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఉజ్జల్ భుయాన్



హైదరాబాద్, అక్టోబర్ 4 (ఈవార్తలు): భారీ సంఖ్యలో దేశ పౌరుల ఓటు హక్కును హరించే ఏ ప్రక్రియ అయినా 'రాజ్యాంగ వ్యవస్థను ఉల్లంఘించడమే' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్ స్పష్టం చేశారు. "ఏ అధికార వ్యవస్థ అలా చేయరాదు.. ఏ న్యాయస్థానం కూడా దానిని సమర్ధించదు" అని ఆయన ఉద్ఘాటించారు. "భారత రాజ్యాంగం పౌరులందర్నీ సమానంగా చూస్తుంది.. ఓటు హక్కు ఉన్నవారు.. ఓటు హక్కులేనివారు అని వర్గీకరించదు" అని హైదరాబాద్‌లో నల్సార్ యూనివర్సిటీలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో జస్టిస్ భూయాన్ అన్నారు. "భారత రాజ్యాంగంలో ఓటు హక్కు ఉన్న పౌరులు.. ఓటు హక్కు లేని తరువాయి 2 వ పేజీలో...

## సీఈసీ జ్ఞానేశ్‌పై విజిలెన్స్ విచారణ

### కేరళలో పాత కేసు రీఓపెన్



తిరువనంతపురం: ప్రస్తుత భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై విజిలెన్స్ విచారణకు కేరళ ప్రభుత్వం ఆదేశించింది. ఆయన గతంలో కేరళ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ) సెక్రటరీగా పనిచేసిన సమయంలో వచ్చిన ఆరోపణలకు సంబంధించి ఈ విచారణ జరగనుంది. కాంగ్రెస్ నేత మలయిన్‌కీళు వేణుగోపాల్ సమర్పించిన పిటిషన్ ఆధారంగా, రాష్ట్ర హోంమంత్రి రమేశ్ చెన్నితాల ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసు 2006 నాటిది. కేరళ రాష్ట్ర రవాణా ప్రాజెక్ట్ (కేఎస్‌టీపీ) కింద ఎంసీ రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగస్వామిగా- 2 వ పేజీలో...

## ముస్లింల ఓట్లు తొలగించే కుట్ర: అసద్



హైదరాబాద్, అక్టోబర్ 4 (ఈవార్తలు): ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫాం-7ను అడ్డుపెట్టుకొని ముస్లిం ఓట్లను తొలగించే యత్నం చేస్తున్నార న్నారు. ముషీరాబాద్, గోషామహల్ ప్రాంతాలలో పెద్దఎత్తున ముస్లిం ఓట్లను తొలిగించే ప్రయత్నం జరుగుతుందని ఓట్లు తొలగిస్తే ఎట్టిపరిస్థితుల్లో చూస్తూ ఊరుకోం అని హైదరాబాద్ ఎంపీ హెచ్చరించారు. కాగా రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ అభ్యంతరాలను స్వీకరించే గడువు గత షెడ్యూల్ ప్రకారం సెప్టెంబరు 16నే ముగియాల్సి ఉండగా దానిని ఈ నెల (అక్టోబరు 7) వరకు పొడిగించారు. అక్టోబరు 19న ప్రకటించాల్సి ఉండగా, రివైజ్డ్ షెడ్యూల్ ప్రకారం ఇప్పుడు నవంబరు 9న ప్రకటిస్తారు. ఈ నేపథ్యంలో అసదుద్దీన్ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి.





### 30 మంది లా స్టూడెంట్స్

## డిబార్

### ఫోన్లు, పుస్తకాలతో మాస్ కాపీయింగ్
### కాకతీయ యూనివర్సిటీలో ఘటన

హనుమకొండ, అక్టోబర్ 4 (ఈవార్తలు): మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న 30మంది విద్యార్థులను డిబార్ చేశామని కేయూ కంట్రోలర్ కట్ల రాజేందర్ తెలిపారు. శనివారం కేయూ మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో కాపీ కొడుతూ ఎస్డీఎల్సీఈ విద్యార్థి పట్టుబడింది. అంతేకాదు తను ఏకంగా జవాబు పత్రంతో పరారైన సంఘటనతో ఒక్కొక్కటిగా మాస్కాపీయింగ్ వ్యవహారాలు బయటకు వస్తున్నాయి. భీమరంలోని అరుణోదయ డిగ్రీ అండ్ పీజీ కాలేజీ సెంటర్‌లో ఎల్ఎల్‌బీ రెండు, మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ పరీక్షల్లో లా విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నట్లు సమాచారం. కాకతీయ యూనివర్సిటీ లా కాలేజీ, ఆదర్శ లా కళాశాల, ఎంజేపీ తరువాయి 2 వ పేజీలో...

# నెక్స్ట్ సీఎం బీసీనే

Next CM BC



### రేవంత్, రాహుల్ మద్దతిస్తారు

### టీపీసీసీ చీఫ్ మహేశ కుమార్ గౌడ్

తెలంగాణ రాష్ట్రానికి బీసీ వ్యక్తి ముఖ్యమంత్రి అవుతారని, అందుకు తమ నాయకులు రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ మద్దతు ఇస్తారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ శంషాబాద్‌లో ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో ఈ వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు, బీసీల గురించి ఇంత గట్టిగా మాట్లాడుతున్నామంటే అందుకు రాహుల్ గాంధీ కారణమని ఆయన వ్యాఖ్యానించారు.

శంషాబాద్/హైదరాబాద్, అక్టోబర్ 4 (ఈవార్తలు):మంత్రివర్గంలో బీసీల సంఖ్యను పెంచుతామని, ఎమ్మెల్యేల్లోనూ వాటా పెరుగుతుందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. 'ఈ రాష్ట్రానికి బీసీ ముఖ్యమంత్రి అయి తీరుతాడని ఘంటాపథంగా చెబుతున్నాను.. రాహుల్ గాంధీ, రేవంత్ బీసీల హక్కుల కోసం ఈ ధైర్యం రాహుల్ గాంధీ ఇచ్చింది.. మల్లికార్జున ఖర్గే ఇచ్చిన ధైర్యం.. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పార్టీ... ఒక కులానికో.. ఒక ప్రాంతానికో,తరువాయి 2 వ పేజీలో...





## ఎవరెస్ట్ జీలకర్రలో పురుగుల మందులు!

### గరిష్ట పరిమితిని మించి అవశేషాలు

### ఓ బ్యాచ్‌కు చెందిన పొడి రీకాల్

న్యూఢిల్లీ, ఎవరెస్ట్ బ్రాండ్ ప్యాక్ చేసిన జీలకర్ర పొడి ఒక బ్యాచ్‌లో అనుమతించిన పరిమితులకు మించి పురుగుమందుల అవశేషాలు ఉన్నట్లు ప్రయోగశాల పరీక్షల్లో నిర్ధారణ కావడంతో, ఆ ఉత్పత్తిని 'అసురక్షితమైనది'గా భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రకటించింది. ఎఫ్ఎస్ఎస్ఏఐ వివరాల ప్రకారం.. గోవాలోని రివర్‌సైడ్ రిసార్ట్స్ అండ్ హాలిడే హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాంగణం నుంచి ప్యాక్ చేసిన జీలకర్ర పొడి నమూనాను సేకరించి పరీక్షించారు. అందులో అజోక్సిస్ట్రోబిన్, థియామెథోక్సామ్ పురుగుమందుల అవశేషాలు నిర్దేశిత గరిష్ఠ పరిమితులను మించినట్లు ఆహార విశ్లేషకుడి నివేదికలో వెల్లడైంది. దీంతో తరువాయి 2 వ పేజీలో...





బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,918 |
| వెండి (కిలో): | రూ.2,45,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,227 |

## పాలమూరు నీళ్లు కుప్పంకు గిఫ్ట్

### తెలంగాణ రైతులకు రేవంత్ అన్యాయం

### టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపిస్తున్నారంటూ తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. కృష్ణా నది జలాలు పొరుగు రాష్ట్రంలోని కుప్పంకు వెళుతున్నాయని, కానీ మన మహబూబ్‌నగర్ రైతులకు మాత్రం చుక్క నీరు అందడం లేదని ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

హైదరాబాద్, అక్టోబర్ 4 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం గత మూడేళ్లలో ఏ ఒక్క నీటిపారుదల ప్రాజెక్టుపై శ్రద్ధ పెట్టకపోవడం వల్లే రాష్ట్రం నేడు కరవుతో అల్లాడుతోందని విమర్శించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో కవిత మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని, ప్రభావిత మండలాలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. ఎల్ నినో తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



కొవ్వు కణజాలం శరీరంలో శక్తిని నిల్వ చేసే ప్రదేశం మాత్రమే కాదని, ఇందులో ఉండే ప్రత్యేక రోగనిరోధక కణాలు వాపును నియంత్రించడం, దెబ్బతిన్న కణాలను తొలగించడం, కొవ్వు కణజాల పనితీరును నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తాజా అధ్యయనం వెల్లడించింది. ఎలుకలపై నిర్వహించిన పరిశోధనలో ఊబకాయం ఈ రోగనిరోధక కణాల పనితీరును దీర్ఘకాలికంగా మార్చగలదని శాస్త్రవేత్తలు గుర్తించారు. ముఖ్యంగా జన్యు సమాచారాన్ని కణాలు ఎలా ఉపయోగించుకుంటాయనే ప్రక్రియలో మార్పులు చోటుచేసుకున్నాయని, ఎలుకలు బరువు తగ్గిన తర్వాత కూడా ఈ మార్పులు కొనసాగాయని పేర్కొన్నారు.



## మచ్చర్‌కు నెతన్యాహు ఆహ్వానం

దుబాయ్: విమానంలో సహ పైలట్ గొడ్డలితో దాడి చేసినా, అసాధారణ ధైర్యంతో పోరాడి వందలాది మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారత పైలట్ స్మిత్ మచ్చర్‌పై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుస్తోంది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నిన్న స్వయంగా కెప్టెన్ మచ్చర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఆయనను 'హీరో'గా అభివర్ణించడమే కాకుండా, ఇజ్రాయెల్ అత్యున్నత గౌరవానికి ఆహ్వానించారు. "మీరు ఇజ్రాయెల్, భారత్, యావత్ ప్రపంచానికి హీరో" అని నెతన్యాహు కొనియాడారు. ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో 'పవిత్ర జ్యోతిని వెలిగించాలని' మచ్చర్‌ను, ప్రధాని తరువాయి 2 వ పేజీలో...

## విమానాన్ని కూల్చేయాలనుకున్నా

### ఫ్లైదుబాయ్ కోపైలట్ వాంగ్మూలం

#### నేరాన్ని అంగీకరించిన హమామ్ అల్-హమామీ



దుబాయ్: ఫ్లైదుబాయ్ విమానం హైజాక్ యత్నం కేసులో నిందితుడైన కోపైలట్ హమామ్ అల్-హమామీ విచారణలో సంచలన విషయాలు వెల్లడించాడు. ఉద్దేశపూర్వకంగానే విమానాన్ని కూల్చివేయాలని ప్రయత్నించానని అంగీకరించాడు. చావంటే తనకు ఏమాత్రం భయం లేదని దర్యాప్తు అధికారులతో స్పష్టం చేశాడు. ఇజ్రాయెల్‌కు తరువాయి 2 వ పేజీలో...



## రాశి ఫలాలు
5.10.2026

మేషం: భాగస్వామ్య వ్యాపారాలు లాభాల బాట పడతాయి. కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలను పరిష్కరించుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. దూరప్రాంతాల బంధువులు నుంచి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

వృషభం: బంధువులతో గృహమున ఆనందంగా గడుపుతారు. చేపట్టిన పనులు చకచకా సాగుతాయి. ఆర్థిక లావాదేవీలు అనుకూలిస్తాయి. వృత్తి, వ్యాపారాలు ఆశించిన విధంగా రాణించి విశేషమైన లాభాలు పొందుతారు. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు తీసుకుని ముందుకు సాగడం మంచిది.

మిథునం: ముఖ్యమైన వ్యవహారాలలో సోదరుల నుంచి కీలక సమాచారం అందుతుంది. చేపట్టిన పనులలో జాప్యం కలిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ఉద్యోగస్తులకు అధికారుల అనుగ్రహం కలుగుతుంది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా అవసరాలకు డబ్బు అందుతుంది. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కర్కాటకం: ఆకస్మిక ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో ఏర్పడిన అవరోధాలను అధిగమిస్తారు. వ్యాపారస్తులకు మాత్రం పెట్టుబడులు అందుతాయి. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలి. చిన్ననాటి మిత్రులతో కష్టసుఖాలను పంచుకొంటారు.

సింహం: నిరుద్యోగుల ప్రయత్నాలు చాలా కష్టం మీద ఫలిస్తాయి. దైవ చింతన పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుతాయి. మొండి బాకీలు వసూలు అవుతాయి. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు.

కన్య: ఉద్యోగాలలో బాధ్యతల నుండి ఉపశమనం కలుగుతుంది. సంతానం విద్య ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. మిత్రులతో ఏర్పడిన మాటపట్టింపులు తొలగిపోతాయి. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలి. దూరపు బంధువుల మిత్రుల నుండి అందిన సమాచారం కొంత ఆనందం కలిగిస్తుంది.

తుల: ఉద్యోగాలలో ఏర్పడిన చికాకులు అధికారుల సహాయంతో రాజి చేసుకుంటారు. గృహ నిర్మాణ విషయమై ముఖ్యమైన నిర్ణయాలు తీసుకొంటారు. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. బంధువుల నుంచి కీలక సమాచారం అందుతుంది. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నుంచి బయటపడతారు.

వృశ్చికం: భూ క్రయవిక్రయాలలో నూతన లాభాలు అందుకుంటారు. ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో సమస్యలు తొలగుతాయి. బంధువర్గం నుండి అవసరానికి ధన సహాయం అందుతుంది. సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు ఫలిస్తాయి.

ధనస్సు: వృత్తి ఉద్యోగాలలో జీతభత్యాల విషయమై శుభవార్తలు అందుతాయి. చిన్ననాటి మిత్రులతో శుభకార్యాలలో పాల్గొంటారు. అనారోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి. రావలసిన సొమ్ము సకాలంలో చేతికి అందుతుంది. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

మకరం: ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. దైవ సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. సంఘంలో విశేషమైన గౌరవ మర్యాదలు పొందుతారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుని పాత విషయాలు చర్చిస్తారు.

కుంభం: నూతన వ్యాపారాల పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగ్గా ఉంటుంది. ఋణదాతల నుండి ఒత్తిడి తొలగుతుంది. దూర ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. బంధువులతో ఏర్పడిన వివాదాలను పరిష్కరించుకొంటారు.

మీనం: ఉద్యోగాలలో ఎదురైన సమస్యల నుండి తెలివిగా బయటపడతారు. ధనాదాయం మార్గాలు పెరుగుతాయి. స్థిరాస్థి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. ముఖ్యమైన వ్యవహారాల్లో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. చిన్ననాటి మిత్రుల నుంచి కీలక సమాచారం అందుకొంటారు. జీవిత భాగస్వామితో విహార యాత్రలో పాల్గొంటారు.

# రాజ్యాంగ ఆత్మపై దాడి

మొదటి పేజీ తరువాయి

పౌరులు అని రెండు వర్గాలు లేవు” అని ఆయన తెలిపారు. ‘ఏదైనా ప్రక్రియ వల్ల కోట్లాది మంది భారతీయ పౌరులు తమ ఓటు హక్కును కోల్పోయి, సొంత దేశంలోనే ద్వితీయ శ్రేణి పౌరులుగా మారితే... అలాంటి ప్రక్రియ ప్రాథమికంగానే అపహాస్యమవుతుంది... ఏ రకంగా దీనిని సమర్థించలేం..... ఇది రాజ్యాంగ ఆత్మనే దెబ్బతీస్తుంది” అని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు సమానత్వ హక్కును ప్రసాదించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, సార్వజనీన వయోజన ఓటు హక్కును కల్పించే ఆర్టికల్ 326ని ఉల్లంఘించడమేనని ఆయన తేల్చిచెప్పారు. “భారత రాజ్యాంగం కింద స్వీకరించిన రక్షణలను ఇది తిరస్కరించడమేనని నేను ఖచ్చితంగా చెబుతాను’ అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. అయితే ఆయన ఏ నిర్దిష్ట ప్రక్రియను లేదా అధికార వ్యవస్థ పేరును ప్రస్తావించలేదు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణలో ఎలక్షన్ కమిషన్‌కు ఉన్న అధికారాన్ని సుప్రీంకోర్టు ఏకగ్రీవంగా సమర్థించిన నాలుగు నెలల తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. గత కొన్ని వారాలుగా ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తి, ఉద్దేశాలపై ప్రతిపక్షాల నుంచి మరోసారి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నల్సార్ లా యూనివర్సిటీలో జరిగిన 19వ నల్సార్-జస్టిస్



బి.ఆర్. సాహ్నే మెమోరియల్ మూట్ కోర్ట్ పోటీల ముగింపు కార్యక్రమంలో జస్టిస్ భుయాన్ ప్రసంగించారు. గతంలో ఆయన ఈ విశ్వవిద్యాలయానికి ఛాన్సలర్‌గా వ్యవహరించారు. “ఒక భారతీయ పౌరుడికి ఓటు హక్కు లేదా ఓటర్ల జాబితాలో పేరు పొందే హక్కును కాదనలేం.. అలా అయితే అది శరీరం నుంచి ఆత్మను వేరు చేసినట్లే అవుతుంది’ అని న్యాయమూర్తి అన్నారు. సుప్రీంకోర్టు ఓటు హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించకపోయినప్పటికీ, రాజ్యాంగబద్ధమైన హక్కుగా గుర్తించిందని ఆయన చెప్పారు. ‘కాబట్టి, నా దృష్టిలో, భారత పౌరుడు తన ఓటును వేసే హక్కు రాజ్యాంగ నిర్మాణానికే అత్యంత కీలకమైనది” అని అన్నారు. సార్వజనీన వయోజన ఓటు హక్కును రాజ్యాంగ రూపకర్తలు సామాన్యుడిపై ఉంచిన ‘నమ్మకం’గా అభివర్ణిస్తూ, “ఒక వ్యక్తి కోటీశ్వరుడు కావచ్చు, మరొకరు రిక్షా కార్మికుడు కావచ్చు; కానీ వారిద్దరికీ ఓటు హక్కు ఉంటుంది.. వారి ఓటు విలువ సమానంగానే ఉంటుంది” అని జస్టిస్ ఉజ్జల్ భూయాన్ పేర్కొన్నారు.

# పాలమూరు నీళ్లు కుప్పంకు గిఫ్ట్

మొదటి పేజీ తరువాయి

ప్రభావంపై శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా కరవు మండలాలను ప్రకటించకపోవడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోందన్నారు. “నార్లాపూర్ రిజర్వాయర్‌పై కొంతైనా ఖర్చు చేసి ఉంటే, ఈరోజు దాన్ని నింపుకొని కల్వకుర్తి ఆయకట్టుకైనా నీరందించే అవకాశం ఉండేది. దానివల్ల భూగర్భ జలాలు కూడా పెరిగేవి” అని కవిత అభిప్రాయపడ్డారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ.. పాలమూరు-రంగారెడ్డి వంటి ఎత్తిపోతల పథకాలను నింపకుండా మన నీటిని ఏపీకి తరలిస్తున్నారని ఆరోపించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం 6-7 గంటల కోతలతో సరిపెడుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ కోతల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికే కాకుండా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన పట్టణాల్లోనూ తాగునీటి ఎద్దడి మొదలైందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కరవుతో నష్టపోతున్న రైతులకు, ప్రజలకు తమ పార్టీ అండగా ఉంటుందని, 60 నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జ్‌లు క్షేత్రస్థాయిలో పనిచేస్తారని కవిత భరోసా ఇచ్చారు.





# నెక్స్ట్ సీఎం బీసీనే

మొదటి పేజీ తరువాయి

ఒక వ్యక్తికో పరిమితమైన పార్టీ కాదు.. కాంగ్రెస్ పార్టీ ఓబీసీలను అక్కున చేర్చుకుంటుంది కాబట్టి అగ్రవర్ణాలు కూడా మద్దతు ఇస్తారనడానికి ఇక్కడ ఉన్న నాయకులే నిదర్శనం... అన్ని కులాల మద్దతుతోనే మాకు రావాల్సిన వాటా తీసుకుంటాం.. అవసరమైతే లాక్కుంటాం..’ అని అన్నారు. రాహుల్ గాంధీ తీసుకున్న నిర్ణయాన్ని.. రేవంత్ రెడ్డి సాకారం చేశారని అన్నారు. “పీవీ నరసింహారావు, మర్రి చెన్నారెడ్డిలాగే బీసీలకు న్యాయం చేసిన వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోవాలని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో తీర్మానం పెట్టి, ఆమోదించి కేంద్రానికి పంపాం.. అసెంబ్లీలో బీజేపీ మద్దతు ఇచ్చింది.. కానీ, రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నారు.. వాళ్లు ప్రధాని మోదీ, అమిత్ షాలకు దగ్గరకు వెళ్లి తెలంగాణ ప్రభుత్వం ఓ గొప్ప కార్యక్రమం చేసింది.. కుల సర్వే దీనిని ఆమోదించండి అని చెప్పే ధైర్యం వీరికి లేదు.. బీజేపీ, బీఆర్ఎస్ మద్దతు ఇచ్చాయి.. కానీ, కేంద్రం ఆమోదించి ఉంటే యావత్తు దేశానికి తెలంగాణ రోల్ మోడల్‌గా ఉండేది” అని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.




# ఎవరెస్ట్ జీలకర్రలో పురుగుల మందులు!

మొదటి పేజీ తరువాయి

ఆ నమూనాను ఆహార భద్రత, ప్రమాణాల చట్టం--2006 ప్రకారం ‘అసురక్షితమైనది’గా ప్రకటించారు. ఆహార విశ్లేషకుడి నివేదికపై అప్పీల్ చేసుకునే అవకాశం తయారీదారుకు కల్పించిన అనంతరం, నమూనాను రెఫరల్ ఆహార ప్రయోగశాలకు పంపించారు. అక్కడ కూడా అధిక పురుగుమందుల అవశేషాల కారణంగా ఉత్పత్తి వినియోగానికి సురక్షితం కాదన్న ప్రాథమిక నిర్ధారణలు ధ్రువీకరించబడ్డాయి. దీంతో బ్యాచ్ నంబర్ ‘ఈ080668761’తో ఉన్న ఎవరెస్ట్ ప్యాక్ చేసిన జీలకర్ర పొడి మొత్తం బ్యాచ్‌ను మార్కెట్ నుంచి తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశించింది. రీకాల్ చేసిన ఉత్పత్తుల పూర్తి వివరాలను నమోదు చేయడంతోపాటు, రీకాల్ సమాచారం, స్థితిగతుల నివేదికలను నిర్ణీత గడువులో సమర్పించాలని ఆహార వ్యాపార నిర్వాహకుడిని ఆదేశించింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దిద్దుబాటు చర్యలు చేపట్టాలని, రీకాల్ ప్రక్రియ పూర్తయిన అనంతరం అనుపాలన నివేదికను సమర్పించాలని సంస్థను కోరింది.






# విమానాన్ని కూల్చేయాలనుకున్నా

మొదటి పేజీ తరువాయి

వెళ్తున్న ఎఫ్ జెడ్ 1073 విమానంలో పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చుర్‌ను ఉద్దేశపూర్వకంగానే దారి మళ్లించి, ఆ తర్వాత తన పథకం ప్రకారం దాడికి పాల్పడినట్లు హమామ్ ఒప్పుకున్నాడు. ప్రార్థన చేసుకుంటానని చెప్పి కెప్టెన్ దృష్టి మరల్చి, విమానంలోని గొడ్డలితో దాడికి యత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఈ ఘటనపై ఇజ్రాయెల్, సౌదీ అరేబియా దర్యాప్తు బృందాలు లోతుగా విచారణ జరుపుతున్నాయి. అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలతో గానీ, ఇరాన్‌తో గానీ ఏమైనా సంబంధాలున్నాయా అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. హమామ్ యూఏఈలో జన్మించాడు. అతడి తండ్రి ఒమన్‌కు, తల్లి సిరియాకు చెందినవారు. ఫ్లైదుబాయ్‌లో చేరడానికి ముందు అతను ఒమన్, సిరియా, మొరాకోలలో నివసించాడు. సిరియాలో ఎక్కువ కాలం నివసించినందున, అక్కడి సుదీర్ఘ అంతర్యుద్ధం సమయంలో అతను ఉగ్రవాదం వైపు ఆకర్షితుడై (రాడికలైజ్) ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. అతని సోషల్ మీడియా ఖాతాల్లో వేలకొద్దీ ఉగ్రవాద సంబంధిత పోస్టులు, సందేశాలను అధికారులు గుర్తించారు. అయితే, ఈ కుట్ర వెనుక ఇంకెవరైనా ఉన్నారా అన్న విషయాన్ని మాత్రం అతను ఇంకా వెల్లడించలేదు. కేసులో విచారణ కొనసాగుతోంది.



# మచ్చర్‌కు నెతన్యాహు ఆహ్వానం

మొదటి పేజీ తరువాయి

నరేంద్ర మోదీని ఆయన ఆహ్వానించారు. ఇది ఇజ్రాయెల్ తమ స్వాతంత్ర్య దినోత్సవాన అందించే అత్యున్నత గౌరవమని, సాధారణంగా ఇది కేవలం ఇజ్రాయెల్ పౌరులకు మాత్రమే దక్కుతుందని తెలిపారు. “ఈ విషయంలో ఇజ్రాయెల్ పౌరులందరూ మిమ్మల్ని అక్కున చేర్చుకుంటారని నేను భావిస్తున్నాను” అని నెతన్యాహు పేర్కొన్నారు.

# 30 మంది లా స్టూడెంట్స్ డిబార్

మొదటి పేజీ తరువాయి




లా విద్యార్థులు అరుణోదయ కాలేజీలోలో ఓపెన్‌గా మాస్ కాపీయింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. లా పరీక్షలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న విద్యార్థులకు ఇన్విజి లేటర్లు పూర్తి సహకారం ఇస్తున్నారని టాక్. స్వయంగా ఇన్విజిలేటర్లు ఫోన్లు, చిట్టీలు, పుస్తకాలు అందించి స్టూడెండ్స్ చూచిరాతకు సహక రిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.పరీక్షల నియంత్రణా ధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది.

# సీఈసీ జ్ఞానేశ్‌పై విజిలెన్స్ విచారణ

మొదటి పేజీ తరువాయి



ఉన్న పాటి-బెల్ కన్సార్టియం తరపున పనిచేసిన మలేషియన్ సివిల్ ఇంజనీర్ లీ సీ బీన్, కేరళ నుంచి తిరిగి వెళ్లాక 2006 నవంబర్‌లో కౌలాలంపూర్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన రాశారని చెబుతున్న సూసైడ్ నోట్‌లో అప్పటి పీడబ్ల్యూడీ సెక్రటరీగా ఉన్న జ్ఞానేశ్ కుమార్ పేరు ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రాజెక్టు పనుల్లో అవకతవకలు జరిగాయని, ఈ కేసులో 2006లో జరిగిన ప్రాథమిక విజిలెన్స్ విచారణ బాహ్య ఒత్తిళ్ల కారణంగా పక్కదారి పట్టిందని వేణుగోపాల్ తన పిటిషన్‌లో ఆరోపించారు. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన హోంమంత్రి రమేశ్ చెన్నితాల, నాటి విచారణకు సంబంధించిన ఫైళ్లన్నింటినీ వెంటనే తమకు సమర్పించాలని ‘విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో’ను (వీఏసీబీ) ఆదేశించారు. ఆనాటి దర్యాప్తు ఎలా జరిగిందీ, నిజంగానే ఏవైనా బయటి శక్తులు దానిని ప్రభావితం చేశాయా అనే కోణంలో ఈ ఫైళ్లను పరిశీలించనున్నారు. నాటి విచారణపై వచ్చిన జోక్యం ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరిపి, నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ డైరెక్టర్‌ను హోంమంత్రి ఆదేశించారు. అయితే, సూసైడ్ నోట్‌లో పేరు ప్రస్తావించినంత మాత్రాన లేదా తాజా విచారణకు ఆదేశించినంత మాత్రాన జ్ఞానేశ్ కుమార్ తప్పు చేసినట్లు నిర్ధారణ కాదని స్పష్టమవుతోంది.

# ప్రపంచ మార్కెట్‌పై జీఆర్ఎస్ఈ గురి

**అంతర్జాతీయ వాణిజ్యమే లక్ష్యంగా అడుగులు**

**2047 నాటికి టాప్ 5లో నిలిచే దిశగా చర్యలు**

**తెలంగాణ మీడియా ప్రతినిధులతో**

**జీఆర్ఎస్ఈ సీఎండీ పీఆర్ హరి వెల్లడి**



కోల్‌కతా, సెప్టెంబర్ 21 (ఈవార్తలు): ప్రపంచ నౌకా నిర్మాణ రంగంలో భారత్‌ను అగ్రస్థానానికి తీసుకెళ్లే దిశగా గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ) పనిచేస్తోందని సంస్థ సీఎండీ, కమోడోర్ పీఆర్ హరి తెలిపారు. 2047 నాటికి తొలి 5 దేశాల్లో భారత్ స్థానం సంపాదించే దిశగా లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు వెల్లడించారు. పీఐబీ–హైదరాబాద్ ఆధ్వర్యంలో తెలంగాణ మీడియా ప్రతినిధుల కోసం నిర్వహిస్తున్న బెంగాల్ పర్యటనలో భాగంగా కోల్‌కతాలోని జీఆర్ఎస్ఈని సందర్శించిన పాత్రికేయులతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచ నౌకా నిర్మాణంలో భారత్ వాటా 0.1 శాతాని కంటే తక్కువగా ఉందని, అనుకున్న లక్ష్యాన్ని చేరేందుకు నౌకా నిర్మాణ సామర్థ్యాన్ని భారీగా పెంచడంతో పాటు దేశీయ సముద్ర పరిశ్రమ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. భారత రక్షణ రంగంలో స్వదేశీ నౌకా నిర్మాణానికి జీఆర్ఎస్ఈ కీలకంగా సేవలందిస్తోందని పీఆర్ హరి తెలిపారు. ఇప్పటివరకు 118 యుద్ధ నౌకలను నిర్మించి అందజేసినట్లు చెప్పారు. 1961లో ఐఎన్ఎస్ అజయ్‌ను నిర్మించడం ద్వారా దేశీయంగా యుద్ధ నౌకల తయారీలో జీఆర్ఎస్ఈ కీలక మైలురాయిని అధిగమించిందన్నారు. ఇప్పటివరకు ప్రధానంగా యుద్ధ నౌకల నిర్మాణంపై దృష్టి పెట్టిన జీఆర్ఎస్ఈ, ప్రస్తుతం వాణిజ్య, రక్షణేతర నౌకా నిర్మాణ రంగాల్లోకి కూడా విస్తరిస్తోందని పీఆర్ హరి తెలిపారు. సుమారు ఐదేళ్ల క్రితం సంస్థ ఆర్డర్ బుక్‌లో దాదాపు 95 శాతం యుద్ధ నౌకల నిర్మాణానికి సంబంధించినదిగా ఉండేదని, ప్రస్తుతం రక్షణేతర విభాగం వాటా 20--25 శాతానికి చేరిందన్నారు. జర్మనీకి చెందిన వాణిజ్య నౌకా యజమాని కోసం 12 బహుళ ప్రయోజన నౌకల నిర్మాణ ప్రాజెక్టును జీఆర్ఎస్ఈ చేపట్టిందన్నారు. మారిషస్, సీషెల్స్, గయానా దేశాలకు కూడా సంస్థ ప్రాజెక్టులు చేపట్టిందని వివరించారు. రానున్న రోజుల్లో వాణిజ్య నౌకా నిర్మాణంలో అవకాశాలు మరింత పెరుగుతాయని, దీంతో రక్షణేతర ఆర్డర్ల వాటా కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. జీఆర్ఎస్ఈ కార్యకలాపాలతో దేశంలోని సుమారు 2,500 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు అనుసంధానమై ఉన్నాయని, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు 'జీఆర్ ఎస్ఈ యాక్సిలరేటెడ్ ఇన్నోవేషన్ నర్చరింగ్ స్కీమ్' (గెయిన్స్)ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. జీఆర్ఎస్ఈ ఇటీవల పూర్తి చేసిన ప్రధాన యుద్ధ నౌకల నిర్మాణ ప్రాజెక్టుల్లో స్వదేశీ పరిజ్ఞానం, పరికరాల వాటా 85 శాతానికి పైగా ఉందని పీఆర్ హరి తెలిపారు. ముఖ్యంగా నౌకల చోదక వ్యవస్థలకు సంబంధించిన కీలక సాంకేతికతలను మరింతగా దేశీయంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీఆర్ఎస్ఈ అధికారులు, పీఐబీ–హైదరాబాద్ అధికారులు శివచరణ్ రెడ్డి, పుల్లయ్య, పీఐబీ–కోల్‌కతా అధికారి సికందర్, ఈవార్తలు దినపత్రిక ఎడిటర్ బొమ్మకంటి శ్రావణ్ కుమార్, హిందీ మిలాప్ ప్రతినిధి సలీం, సాక్షి ప్రతినిధి మంజుల, మన తెలంగాణ బ్యూరో చీఫ్ వెల్జాల చంద్రశేఖర్ గౌడ్, 10 టీవీ బ్యూరో చీఫ్ తిరుపతిచారి, వీ6 ప్రతినిధి హరిత, ది హ్యాన్స్ ఇండియా ప్రతినిధి స్వీయ, మున్సిఫ్ ప్రతినిధి సయ్యద్, కెమెరామెన్లు శ్రీకాంత్, ధనుంజయ్ పాల్గొన్నారు. అనంతరం మీడియా ప్రతినిధుల బృందం ఆర్మీ ఈస్టర్న్ కమాండ్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.



## ఏపీలో 4 రోజులు భారీ వర్షాలు

వైజాగ్, సెప్టెంబర్ 21 (ఈవార్తలు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. ప్రస్తుతం కేంద్రీకృతమై ఉన్న అల్పపీడనం మంగళవారానికి వాయుగుండంగా బలపడనుందని, దీని ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు దంచికొడతాయని స్పష్టం చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. విపత్తుల నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం, మంగళవారం (సెప్టెంబర్ 22) నుంచి రాష్ట్రంలో వర్షాల తీవ్రత పెరగనుంది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, మిగిలిన కోస్తాంధ్ర జిల్లాల్లో మోస్తరు వర్షాలు, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడతాయని తెలిపింది. బుధవారం (సెప్టెంబర్ 23) నాటికి వర్షాల ప్రభావం మరింత పెరగనుంది. అల్లూరి, పోలవరం, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో భారీ వర్షాలు, ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. గురు, శుక్రవారాల్లో సైతం కోస్తా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు.. ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడతాయని వివరించింది. ఈ నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ కీలక హెచ్చరికలు జారీ చేసింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేసింది. అందువల్ల మత్స్యకారులు తదుపరి ఆదేశాలు వచ్చేవరకు వేటకు వెళ్లరాదని స్పష్టంగా సూచించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు, నదీ పరివాహక ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. ప్రజలు ఎప్పటికప్పుడు అధికారిక ప్రకటనలను గమనిస్తూ, అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## దానం పిటిషన్ స్వీకరణ



న్యూఢిల్లీ: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను పదవి నుంచి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన సంచలన తీర్పుపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో విచారణ ప్రక్రియ ప్రారంభమైంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారణకు స్వీకరించడానికి సుప్రీంకోర్టు సమ్మతించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట దానం నాగేందర్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ఈ అంశాన్ని ప్రస్తావించగా, ఈ పిటిషన్‌ను బుధవారం (సెప్టెంబర్ 23) విచారించనున్నట్లు ధర్మాసనం వెల్లడించింది. హైకోర్టు తీర్పు వల్ల ఖైరతాబాద్ స్థానం ఖాళీగా మారి ఉపఎన్నిక నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున, హైకోర్టు ఉత్తర్వులపై వెంటనే స్టే విధించాలని దానం తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టులో వాదనలు వినిపించనున్నారు. గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేసి విజయం సాధించిన దానం నాగేందర్... ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరడమే కాకుండా 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఒక పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి మరో పార్టీ తరఫున పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన పాత ఆదేశాలను పక్కనపెట్టిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించడంతో ఈ వివాదం ఇప్పుడు దేశ అత్యున్నత న్యాయస్థానం మెట్లు ఎక్కింది.

# ప్రపంచ మార్కెట్‌పై జీఆర్ఎస్ఈ గురి

**పీఐబీ కోల్‌కతా కార్యాలయంలో**

**తెలంగాణ మీడియా బృందం సందడి**



కోల్‌కతా, సెప్టెంబర్ 21 (ఈవార్తలు): ప్రెస్ టూర్‌లో భాగంగా కోల్‌కతాలో పర్యటిస్తున్న తెలంగాణ మీడియా ప్రతినిధుల బృందం సోమవారం పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ)– కోల్‌కతా కార్యాల యాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా తూర్పు ప్రాంతం డైరెక్టర్ జనరల్ టీవీకే రెడ్డితో ప్రతినిధుల బృందం సమావేశమై పలు అంశాలపై చర్చించింది. మీడియా ప్రతినిధుల పర్యటన లక్ష్యాలు, ప్రాధాన్యాలను వివరించారు. తెలంగాణ, ఏపీ రాజకీయ, సామాజిక పరిస్థితులపై, మీడియా పాత్రపై ఆరా తీశారు. ప్రభుత్వానికి, మీడియాకు మధ్య సమాచార వారధిగా పీఐబీ నిర్వహిస్తున్న పాత్రను వివరించారు. తూర్పు ప్రాంతంలో పీఐబీ కార్యకలాపాలు, ప్రభుత్వ ఇవిధానాలు, పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబం ధించిన సమాచారాన్ని పాత్రికేయులకు అం దించేందుకు చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం తెలంగాణ మీడి యా ప్రతినిధులతో ముచ్చటించి వారి అనుభవాలను తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి పర్యటనలతో సంబంధిత అంశాలపై అవగాహన కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఐబీ అధికారులు, తెలంగాణ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌కు వందల ఎకరాలు ఎక్కడివి?: కడియం



హనుమకొండ, సెప్టెంబర్ 21 (ఈవార్తలు): హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని వరంగల్ ఎంపీ కడియం కావ్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డితో కలిసి స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఘనంగా ప్రారంభించారు. నూతనంగా ఎన్నికైన మండల కమిటీ ప్రతినిధులను శాలువాలతో సన్మానించిన అనంతరం జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, ప్రజాక్షేత్రంలో ఉంటూ రేవంత్ రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి అయ్యేలా పట్టుదలతో పనిచేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. 'కొత్త, పాత' వ్యత్యాసాలు వీడి, కేవలం పార్టీ పేరు చెప్పుకుని తిరిగే సంస్కృతికి దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. ఇదే సమయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గడిచిన 12 ఏళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఒక్క జాతీయ సంస్థనుగానీ, రూ.1000 కోట్ల ప్రాజెక్టునుగానీ మంజూరు చేయకుండా కుల, మత రాజకీయాలతో చిచ్చు పెడుతోందని ఆరోపించారు. మరోవైపు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుంటూ, 2014 ఎన్నికల అఫిడవిట్‌లో ఒక్క ఎకరం భూమి కూడా లేదని చూపించిన కల్వకుంట్ల కుటుంబానికి పదేళ్ల పాలన తర్వాత నేడు వందల ఎకరాలు, ఫామ్‌హౌస్‌లు, వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. 2014కి ముందు ఉన్న ఆస్తులు, ప్రస్తుతం ఉన్న సంపదపై తెలంగాణ ప్రజలకు కేసీఆర్ కుటుంబం సమాధానం చెప్పాలని కడియం శ్రీహరి సవాల్ విసిరారు.

# మాజీ మావోయిస్టుల నేతృత్వంలో కొత్త పార్టీ



హైదరాబాద్, సెప్టెంబర్ 21 (ఈవార్తలు): తెలంగాణ దశాబ్దాల సామాజిక, రాజకీయ ఆకాంక్షలకు, ఉద్యమ భావజాలానికి ప్రాతిపదికగా రాష్ట్ర రాజకీయ యవనికపై త్వరలోనే నూతన పార్టీ ఆవిర్భవించేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. దాదాపు ఐదు దశాబ్దాలుగా విప్లవోద్యమాల్లో చురుగ్గా పనిచేసి, తదనంతరం సామాన్య జీవితంలోకి అడుగుపెట్టిన మాజీ మావోయిస్టులే ప్రధాన చోదకశక్తిగా 'జన తెలంగాణ పార్టీ' రూపుదిద్దుకుంటోంది. లంకా పాపిరెడ్డి (లచ్చన్న), అడ్వొకేట్ బల్ల రవీంద్రనాథ్, గురిజాల రవీందర్‌రావులతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన అభ్యుదయవాదులు, పౌరహక్కుల ఉద్యమకారులు ఇందులో కీలక పాత్ర పోషించనున్నారు. అయితే, ఆపరేషన్ కగార్ అనంతర పరిణామాల్లో బయటకు వచ్చిన దేవ్‌జీ–సంగ్రామ్ లేదా సోనూ–ఆశన్న వర్గాలు ఈ పార్టీ నిర్మాణంలో భాగస్వాములు కావడం లేదని తెలుస్తోంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానంలోకి అడుగుపెడుతున్న ఈ కొత్త పార్టీ, త్వరలో జరగనున్న వరంగల్–ఖమ్మం–నల్లగొండ హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతోంది. భారీ ప్రాజెక్టులు, జీడీపీ గణాంకాలే అభివృద్ధి కాదని, సామాన్యులకు ఉచిత విద్య, వైద్యం, యువతకు ఉపాధి, ప్రశ్నించే స్వేచ్ఛే అసలైన అభివృద్ధి ప్రామాణికాలని తమ విధానపత్రంలో పొందుపరచనున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పుష్కర కాలమైనా ప్రజా సమస్యలు తీరలేదన్న అభిప్రాయంతో ఉన్న ఈ బృందం, త్వరలోనే కేంద్ర ఎన్నికల కమిషన్‌కు పార్టీ నమోదు కోసం అధికారికంగా దరఖాస్తు చేయనుంది.

# కేసీఆర్ వల్లే నీటి ఎద్దడి: జూపల్లి



హైదరాబాద్, సెప్టెంబర్ 21 (ఈవార్తలు): గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవగాహన రాహిత్యం, నిర్లక్ష్యపూరిత విధానాల వల్లే నేడు రాష్ట్రంలో నీటి నిల్వలు తగ్గి రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి దాపురించిందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అసెంబ్లీ ప్రాంగణంలోని మీడియా సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన... కేసీఆర్ హయాంలో కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను కేవలం 30 శాతానికే పరిమితం చేసి ఆంధ్రా ప్రాజెక్టులకు లబ్ధి చేకూర్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పోరాడి ఆ వాటాను 43 శాతానికి పెంచుకున్నామని స్పష్టం చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రారంభించిన కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే పాలమూరు తీవ్రంగా నష్టపోయిందన్నారు. రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసిన కేసీఆర్ పాలమూరు జిల్లాలో రిజర్వాయర్లను ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. గట్టు వద్ద 20 టీఎంసీల రిజర్వాయర్ కడతానని చెప్పిన కేసీఆర్ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. జూరాల వద్ద అదనపు రిజర్వాయర్ నిర్మించకపోవడం వల్లే ఈనాడు 5.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఈ నీటి ఎద్దడిని నివారించేందుకు 15 టీఎంసీల గూడెందొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి జీవో జారీ చేయడమే కాకుండా, రికార్డు స్థాయిలో 19,543 మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుంటూ సరఫరా వ్యవస్థను కాపాడుతోందని వెల్లడించారు. ఎల్ నినో కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్రం నుంచి రూ.20 వేల కోట్ల నిధులు, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకురావడంలో విఫలమైన బీఆర్ఎస్, బీజేపీ నేతలు కేవలం శవాలపై పేలాలు ఏరుకునే రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

## తాతా మధు, నవీన్ రెడ్డికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (ఈవార్తలు): స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను అసభ్య పదజాలంతో దూషించారనే ఆరోపణల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం షాక్ ఇచ్చింది. నాంపల్లి సీనియర్ సివిల్ కోర్టు ఇచ్చిన అరెస్ట్, రిమాండ్ నిరాకరణ ఉత్తర్వులను సవాలు చేస్తూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం, ఈ వ్యవహారంలో తమ సమాధానాన్ని వివరణాత్మకంగా కౌంటర్ దాఖలు చేయాలని ఇద్దరు ఎమ్మెల్సీలకు అధికారిక నోటీసులు జారీ చేసింది. విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వరరావు కోర్టు ఎదుట వాదనలు వినిపిస్తూ, రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు అత్యంత అనుచిత పదజాలంతో దూషించడమే కాకుండా... విధులు నిర్వర్తిస్తున్న పోలీసు అధికారులపై కూడా దాడులకు తెగబడ్డారని తెలిపారు. వీరిద్దరి అరెస్టును, రిమాండ్‌ను అడ్డుకుంటూ నాంపల్లి కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలని కోరారు. ఇరు వర్గాల ప్రాథమిక నివేదికలను పరిశీలించిన హైకోర్టు, తదుపరి స్పష్టత కోసం ఎమ్మెల్సీల కౌంటర్ దాఖలుకు ఆదేశిస్తూ తదుపరి విచారణను ఎల్లుండికి వాయిదా వేసింది.

# సర్వే..కొనసాగుతోంది!

**కేసీఆర్ ఫాంహౌస్ చుట్టూ భూసర్వే**

**రంగంలోకి రెవెన్యూ అధికారులు**

శాటిలైట్ మ్యాపింగ్‌తో భూముల హద్దుల పరిశీలన

సిద్దిపేట, సెప్టెంబర్ 21 (ఈవార్తలు): సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై రెవెన్యూ అధికారులు సర్వే కొనసాగిస్తున్నారు. ఎర్రవల్లితో పాటు వెంకటాపూర్, వరదరాజుపూర్ సరిహద్దుల్లో ఉన్న భూములను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో నిలిచిన సర్వే.. సోమవారం ఉదయం తిరిగి ప్రారంభమైంది. సర్వే నంబర్ 325 పరిధిలో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మొత్తం 388 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూముల్లో ప్రభుత్వ భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? ప్రస్తుతం ఎవరి అధీనంలో ఉంది? ప్రైవేటు పట్టా భూములు ఎంతమేర ఉన్నాయి? అనే వివరాలను సేకరిస్తున్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ సుదర్శన్ రాథోడ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సేవ్యానాయక్, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, స్థానిక తహసీల్దార్లతో కూడిన ప్రత్యేక బృందాలు సర్వేలో పాల్గొంటున్నాయి. శాటిలైట్ మ్యాపింగ్, ఆధునిక సాంకేతికతతో పాటు పాత రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తూ భూముల హద్దులను నిర్ధారిస్తున్నారు. సర్వే నంబర్ 325 పరిధిలో భూములు ఉన్న 100 మందికి పైగా రైతులకు ఇప్పటికే అధికారులు నోటీసులు ఇచ్చారు. పట్టాదార్ పాస్‌పుస్తకాలు, ఇతర యాజమాన్య పత్రాలతో సర్వే ప్రాంతానికి రావాలని సూచించారు. ఫామ్‌హౌస్ పరిసర భూముల కేటాయింపులు, ధరణి రికార్డుల్లో అక్రమాలపై ఇటీవల అసెంబ్లీలో చర్చ జరిగిన నేపథ్యంలో ఈ విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సర్వే పూర్తయ్యాక సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి అందజేయనున్నారు.



## రాజన్న అన్నదాన ట్రస్టుకు రూ.1.10 లక్షల విరాళం

వేములవాడ అర్బన్, అక్టోబర్ 4 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం నిత్య అన్నప్రసాదం ట్రస్టుకు హైదరాబాద్ గోనాపూర్‌కు చెందిన భక్తుడు కె. జలంధర్‌రెడ్డి రూ.1,10,016 విరాళంగా అందించారు. ఆలయ ప్రోటోకాల్ కార్యాలయంలో పీఆర్వో పెరిక శ్రీనివాస్‌కు నగదు విరాళాన్ని అందజేశారు. అనంతరం జలంధర్‌రెడ్డి శ్రీ భీమేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం ఆలయ మండపంలో వేద పండితులు, అర్చకులు వేదాశీర్వచనం అందించారు. ఆలయ పర్యవేక్షకుడు శ్రీనివాస్ శర్మ దాతకు శేషవస్త్రాలు కప్పి, లడ్డూ ప్రసాదాలు అందజేసి సత్కరించారు. అన్నదాన పథకానికి విరాళం అందించిన దాతను ఆలయ అధికారులు అభినందించారు.

## ప్రమాదకర విద్యుత్ స్తంభం తొలగింపు



మల్యాల, అక్టోబర్ 4 (ఈవార్తలు): మల్యాల మండల కేంద్రంలోని అంగడి బజార్ ప్రాంతంలో ప్రమాదకరంగా ఉన్న ఇనుప విద్యుత్ స్తంభంపై వెలువడిన వార్తకు విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆదివారం పాత ఇనుప స్తంభం స్థానంలో కొత్త సిమెంట్ విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. రద్దీగా ఉండే అంగడి బజార్ ప్రాంతంలో దెబ్బతిన్న ఇనుప స్తంభం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ సమస్యపై వార్త ప్రచురితమైన కొద్ది రోజుల్లోనే అధికారులు స్పందించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను గుర్తించి వెంటనే చర్యలు తీసుకున్న విద్యుత్ శాఖ అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## దొంగలమర్రి వద్ద ప్రయాణికుల ఎదురుచూపులు

కొడిమ్యాల, అక్టోబర్ 4 (ఈవార్తలు): కొడిమ్యాల మండలం నాచుపల్లి మండలం దొంగలమర్రి వద్ద బస్సులు నిలపకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సుల కోసం గంటల తరబడి వేచి చూసినా ఆపకపోవడంతో మహిళలు, వృద్ధులు, కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దొంగలమర్రి వద్ద బస్సులు నిలిపేలా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## 7 షరతులు ఓకే చెప్తేనే ఓకే!

టెహ్రాన్: అమెరికాకు ఇరాన్ మరోసారి ఝలక్ ఇచ్చింది. ఇరాన్ విధించిన ఏడు షరతులను నెరవేర్చే వరకు హార్ముజ్ జలసంధిని ఎట్టిపరిస్థితుల్లో తిరిగి తెరవబోయేది లేదని తెలిపింది. ఈ ఏడు షరతులు జూన్‌లో ఇరాన్--అమెరికా మధ్య కుదిరిన తాత్కాలిక ఒప్పందం అనగా.. ఇస్లామాబాద్ మెమొరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్ ఆధారంగా ఉన్నాయని ప్రకటించింది. ఈ మేరకు ఇరాన్ స్పీకర్ కీలక ప్రకటన విడుదల చేశారు. మహమ్మద్ గాలిబాఫ్ మాట్లాడుతూ, "ఇరాన్ వైఖరి "పూర్తిగా స్పష్టంగా, దృఢంగా" ఉంది. అమెరికా ఈ ఏడు షరతులను అమలు చేసే వరకు హోర్ముజ్ జలసంధి తెరవడం జరగదు. ఒకవైపు అమెరికా బహిరంగంగా ఒక రకమైన సందేశాలు ఇస్తూనే, మరోవైపు మధ్యవర్తి ద్వారా వేరే ప్రతిపాదనలు పంపుతోంది. ఇకపై చర్చల్లో జాప్యాన్ని లేదా అమెరికా ఏకపక్ష డిమాండ్లను ఇరాన్ అంగీకరించదు". అని అన్నారు. ఇరాన్ నుంచి వచ్చిన దౌత్య ప్రతిపాదనకు అమెరికా ఇచ్చిన సమాధానం కొన్ని రోజుల క్రితమే తమకు అందిందని ఆయన తెలిపారు.

# కబడ్డీ క్రీడాకారులకు అన్ని ఏర్పాట్లు

**రాష్ట్రస్థాయి పోటీలకు ఆతిథ్యమివ్వడం సంతోషం**

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వెల్లడి**



వేములవాడ అర్బన్, అక్టోబర్ 4 (ఈవార్తలు): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. వేములవాడ పట్టణంలో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించగా ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వేములవాడ ఆతిథ్యమివ్వడం సంతోషంగా ఉందన్నారు. గతంలో క్రీడల అభివృద్ధికి సంబంధించి వివిధ బాధ్యతలు నిర్వహించిన సమయంలోనూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. 2008లో శ్రీధర్ బాబు మంత్రిగా ఉన్న సమయంలో క్రీడలకు సంబంధించి అవార్డు అందుకున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అనంతరం రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో భాగంగా కరీంనగర్‌లో వాలీబాల్ పోటీలను విజయ వంతంగా నిర్వహించామని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరై పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. కబడ్డీ పోటీల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టామని చెప్పారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు, ఇతర బాధ్యతల కారణంగా తేదీల ఖరారులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నప్పటికీ, కమిటీ సూచించిన తేదీలకు అనుగుణంగా పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు ఆతిథ్యంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రత్యేక చర్యలు తీసు కున్నామని ఆది శ్రీనివాస్ తెలిపారు. క్రీడాకా రులకు వసతి, భోజనం కల్పించేందుకు కళ్యాణ మండపాలు, ఇతర అనువైన వేదికలను సిద్ధం చేశామని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి కమిటీ సూచించిన మెనూ ప్రకారం భోజన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. తమ ప్రాంతానికి వచ్చిన క్రీడాకారులను అతిథులుగా కాకుండా కుటుంబ సభ్యులుగా భావించి ఆత్మీయంగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. గతంలో వాలీబాల్ పోటీలకు హాజరైన క్రీడాకారులు కూడా స్థానికుల ఆతిథ్యం, ఆత్మీయతను ప్రశంసిస్తూ వెళ్లారని గుర్తుచేశారు. క్రీడా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంతో పాటు క్రీడాకారులకు మంచి అనుభూతిని కల్పించి చిరకాలం గుర్తుండిపోయేలా చూడాలని అన్నారు. సామాన్య కుటుంబాలు, గ్రామీణ ప్రాంతాల నుంచి ఎదుగుతున్న క్రీడాకారుల కష్టాలను గుర్తించి వారికి అన్ని విధాలా సహకారం అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పోటీల ముగింపు వరకు క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించాలని అధికారులకు, నిర్వాహకులకు సూచించినట్లు తెలిపారు. క్రీడాకారుల అభిప్రాయా లను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుం టున్నామని చెప్పారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఆతిథ్యమిచ్చే అవకాశం కల్పించిన రాష్ట్రస్థాయి కమిటీకి, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, నిర్వాహ కులకు, స్థానిక నాయకులకు ఆది శ్రీనివాస్ కృతజ్ఞ తలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభా వంతులైన క్రీడాకారులకు సరైన అవకాశాలు కల్పించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహిం చాల్సిన అవసరం ఉందన్నారు.



## రాజన్న సంస్కృత పాఠశాలలో ముందస్తు బతుకమ్మ

వేములవాడ అర్బన్, అక్టోబర్ 4 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ రాజరాజేశ్వర సంస్కృత విద్యాసంస్థల పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దసరా, బతుకమ్మ సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాల ప్రాంగణంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్. రమాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులతో కలిసి ఆమె బతుకమ్మ ఆడారు. విద్యార్థులు కోలాటాలు, దాండియా నృత్యాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. ప్రకృతిని, పూలను పూజించే అద్భుతమైన సంస్కృతి తెలంగాణకు ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను తెలుసుకోవాలని సూచించారు. తీరొక్క పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మల చుట్టూ విద్యార్థినులు లయబద్ధంగా చప్పట్లు కొడుతూ బతుకమ్మ పాటలు పాడారు. బాలురు పాటలకు అనుగుణంగా దాండియా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం ఈవో రమాదేవి బతుకమ్మను తలపై ఎత్తుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఊరేగింపుగా తీసుకెళ్లి శాస్త్రోక్తంగా నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల పర్యవేక్షకులు వెంకటలక్ష్మి, పూజిత, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, ఆలయ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి యూత్ కాంగ్రెస్ కార్యవర్గం భేటీ



కూకట్‌పల్లి, అక్టోబర్ 4 (ఈవార్తలు): కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం శ్రీ హేమదుర్గా భవన్‌లో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డి. సలీం ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి భవ్య, జిల్లా ఇన్‌చార్జీలు మున్నీర్ అహ్మద్, నాగార్జున, జిల్లా అధ్యక్షుడు బొమ్మక్క అజయ్, రాష్ట్ర కార్యదర్శి రమ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి యువతే ప్రధాన బలమని అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. యువత ప్రజా సమస్యలపై ముందుండి పోరాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రతి డివిజన్‌లో యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ యువతను పెద్ద సంఖ్యలో పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్ కార్యకలాపాల బలోపేతం, యువతను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం, రాబోయే కార్యక్రమాలపై చర్చించారు. నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు బీజేపీ సన్మానం



వేములవాడ అర్బన్, అక్టోబర్ 4 (ఈవార్తలు): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో వేములవాడ మున్సిపల్ కార్మికులను ఘనంగా సన్మానించారు. స్థానిక పద్మశాలి సంఘంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి సంటి మహేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంటి మహేష్ మాట్లాడుతూ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు క్రాంతి కుమార్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్మికులను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ వేములవాడను స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ముందంజలో నిలపడంలో మున్సిపల్ కార్మికుల కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. బీజేపీ నాయకుడు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు గత నెల 17 నుంచి ఈ నెల 17 వరకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే మున్సిపల్ కార్మికులను సన్మానించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, కౌన్సిలర్ కుమ్మరి శంకర్, సీనియర్ నాయకులు సంటి అంజిబాబు, చిక్కుడు మల్లేశం, కటకం శ్రీనివాస్, సగ్గు రాహుల్, బుర్రమనిష్ తదితరులు పాల్గొన్నారు.



## షైదుబాయ్ ఘటన తరహా దాడులు చేయండి

**అల్ ఖైదా మద్దతు పత్రిక పిలుపు**

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా మరోసారి ఉగ్రవాద దాడుల కలకలం రేగింది. అమెరికా, ఇజ్రాయెల్‌కు చెందిన విమానాలపై దాడులు చేయాలంటూ అల్ ఖైదా మద్దతుదారులు పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన షైదుబాయ్ విమాన హైజాక్ యత్నాన్ని, 2001 సెప్టెంబర్ 11 దాడులను స్ఫూర్తిగా తీసుకుని 'కాపీక్యాట్ దాడులు' (అచ్చం అలాంటి దాడులే) చేయాలని తమ పత్రిక ముఖంగా రెచ్చగొట్టారు. ఈ పరిణామం ప్రపంచవ్యాప్తంగా భద్రతా ఏజెన్సీలను అప్రమత్తం చేసింది. అల్ ఖైదా మద్దతుతో నడుస్తున్న 'అల్ బయాన్' అనే అరబిక్ వారపత్రిక ఈ మేరకు ఓ కథనాన్ని ప్రచురించింది. "యుద్ధం ఇంకా ముగియలేదు. జియోనిస్టులు, అమెరికన్లు, ఇస్లాంకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఇతర అవిశ్వాసులను మోసుకెళ్లే విమానాలు ఇంకా ఆకాశంలో ఎగురుతూనే ఉన్నాయి. సెప్టెంబర్ 11, సెప్టెంబర్ 30న జరిగినట్లుగా వాటిని లక్ష్యంగా చేసుకోవచ్చు" అని ఆ కథనంలో పేర్కొన్నారు. 9/11, షైదుబాయ్ ఘటనలకు సంబంధించిన చిత్రాలను కూడా దీనికి జోడించారు. కొద్ది రోజుల క్రితం దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళుతున్న షైదుబాయ్ విమానాన్ని నేలకూల్చేందుకు విఫలయత్నం జరిగిన విషయం తెలిసిందే. ఆ విమాన కో-పైలట్, కాక్‌పిట్‌లోని గొడ్డలితో కెప్టెన్‌పై దాడి చేసి విమానాన్ని తన ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటనలో విమానం వేగంగా కిందకు దూసుకెళ్లి పెను ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకుంది. ఈ హైజాక్ యత్నానికి పాల్పడిన కో-పైలట్ ఒమన్‌కు చెందినవాడని, అతనికి తీవ్రవాద భావజాలం ఉందన్న కారణంతో గతంలోనే ఒమన్ అధికారులు విమానాలు నడపకుండా నిషేధం విధించారని దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలోనే అల్ ఖైదా మద్దతుదారులు ఈ ఘటనను ఓ విజయంగా చిత్రిస్తూ దాడులకు పిలుపునివ్వడం గమనార్హం. శనివారం టెలిగ్రామ్ ఛానళ్లలో ఈ పోస్ట్ సర్క్యులేట్ అయినప్పటికీ, ఆ తర్వాత దానిని తొలగించినట్లు తెలుస్తోంది.

## అమెరికా ఒంటరి

ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో పెను మార్పులు చోటుచేసుకుంటున్న తరుణంలో.. అమెరికా స్వయంగా ఎంచుకున్న వైఖరి కారణంగానే అంతర్జాతీయంగా క్రమంగా ఒంటరి శక్తిగా మారుతోందని భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. జర్మనీలో జరిగిన 62వ మ్యూనిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్ వేదికగా ఆయన ప్రసంగిస్తూ.. అమెరికా కొత్త వైఖరి, చైనా తిరుగులేని ఆర్థిక ఎదుగుదల ప్రపంచ క్రమాన్ని పూర్తిగా మార్చేస్తున్నాయని విశ్లేషించారు. అమెరికా అనుసరిస్తున్న విధానాలు బాహ్య ఒత్తిళ్ల వల్ల కాకుండా.. సొంత నిర్ణయాలతోనే జరుగుతున్నాయని జైశంకర్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం అంతర్జాతీయ వేదిక ప్రధానంగా వాషింగ్టన్ తీసుకుంటున్న సరికొత్త నిర్ణయాలతో ప్రభావితమవుతోందని అన్నారు.

మరోవైపు చైనా ఎదుగుదలను రెండో ప్రధాన అంశంగా ఆయన ప్రస్తావించారు. ప్రపంచ తయారీ రంగంలో దాదాపు మూడో వంతు వాటా చైనా వద్దే ఉందని, ఆ ఆర్థిక బలమే ఇప్పుడు బీజింగ్‌కు అంతర్జాతీయంగా భారీ రాజకీయ పలుకుబడిని తెచ్చిపెడుతోందని పేర్కొన్నారు.

# ఇంటర్నెట్ లేకుండా ఫోన్లలోనే లైవ్ టీవీ

**ప్రసార భారతి ద్వారా డీ2ఎం సేవలు!**

**వచ్చే నెలలలో ప్రతిపాదన జారీ చేసే చాన్స్**

న్యూఢిల్లీ: ఇంటర్నెట్ కనెక్షన్ లేకపోయినా, మొబైల్ డేటా ఖర్చు చేయకపోయినా ఫోన్‌లో లైవ్ టీవీ చూడగలిగే రోజులు త్వరలో చూడనున్నాం. ప్రభుత్వ ప్రసార సంస్థ ప్రసార భారతి డైరెక్ట్-టు-మొబైల్ (డీ2ఎం) సేవలను కమర్షియల్‌గా ప్రారంభించేందుకు వీలుగా వచ్చే నెలలో ప్రతిపాదన జారీ చేసే అవకాశం ఉంది. ఇప్పటివరకు ట్రయల్స్, టెక్నాలజీ పరీక్షలకే పరిమితమైన డీ2ఎంను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి ఇది కీలక అడుగు కానుంది. తేజస్ నెట్‌వర్క్స్ అభివృద్ధి చేసిన పరికరాలతో నిర్వహించిన టెక్నాలజీ వెరిఫికేషన్ పరీక్షలు ప్రభుత్వ సమీక్షలో అనుమతి సాధించిన తర్వాత ఈ ప్రాజెక్టుకు ఊపు వచ్చినట్లు సమాచారం. అయితే వాణిజ్య సేవలు ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తాయనే దానిపై ఇంకా స్పష్టత లేదు. ఇవి అందుబాటులోకి వస్తే త్వరలో మొబైల్ డేటా లేదా రీఛార్జ్ ప్లాన్‌తో పనిలేకుండానే స్మార్ట్‌ఫోన్లలో నేరుగా లైవ్ టీవీ, వార్తలు, క్రీడా ప్రసారాలను చూడవచ్చు. ప్రైవేట్ టెలికాం ఆపరేటర్లతో పనిలేకుండా, ఫోన్లలోని ఎఫ్ఎం రేడియో పనిచేసే విధానంలోనే రేడియో ఫ్రీక్వెన్సీల ద్వారా కంటెంట్‌ను ప్రసారం చేసే ఈ విధానం అందుబాటులోకి వస్తే, నెట్‌వర్క్ ట్రాఫిక్ తగ్గడంతో పాటు అత్యవసర హెచ్చరికలను కూడా ప్రజలకు క్షణాల్లో చేరవేయవచ్చు. ఐఐటీ కాన్పూర్, తేజస్ నెట్‌వర్క్స్, సాంఖ్య ల్యాబ్స్ భాగస్వామ్యంతో దేశవ్యాప్తంగా 19కి పైగా నగరాల్లో నిర్వహించిన డీ2ఎం ట్రయల్స్ విజయవంతమయ్యాయి. 470-582 మెగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్ బ్యాండ్‌లో ప్రసారాలు చేయడం వల్ల సెల్యులార్ నెట్‌వర్క్‌లకు ఎలాంటి అంతరాయం కలగదని, ఫోన్లు వేడెక్కే ప్రమాదం కూడా లేదని ప్రసార భారతి నివేదికలు స్పష్టం చేశాయి. ఢిల్లీ, బెంగళూరులలో నిర్వహించిన ప్రూఫ్-ఆఫ్-కాన్సెప్ట్ ప్రాజెక్టులు సాంకేతికంగా విజయం సాధించడంతో, ఈ సాంకేతికతను విస్తృత వ్యాపార స్థాయిలో అమలు చేయడానికి ప్రభుత్వం పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) మోడల్‌ను పరిశీలిస్తోంది. ఈ టెక్నాలజీ అమలులో రావడానికి ప్రధాన అడ్డంకి హార్డ్‌వేర్ సపోర్ట్ లేకపోవడమే. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న స్మార్ట్‌ఫోన్లలో డీ2ఎం ప్రసారాలను అందుకునే ఏటీఎస్‌సీ 3.0 ప్రామాణిక చిప్‌సెట్లు, యాంటెన్నాలు, బేస్‌బ్యాండ్ ప్రాసెసింగ్ యూనిట్లు లేవు. రాబోయే రోజుల్లో స్మార్ట్‌ఫోన్ తయారీదారులు ఈ ప్రత్యేక హార్డ్‌వేర్‌ను తమ హ్యాండ్‌సెట్లలో అమర్చాల్సి ఉంటుంది. అంతేకాకుండా, దేశమంతటా ఈ ప్రసారాలను నాణ్యంగా అందించాలంటే టెరెస్ట్రియల్ ప్రసార టవర్ల నెట్‌వర్క్‌ను మరింత ఎక్కువగా విస్తరించాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు.




# భారతీయులకు రష్యాలో 70 వేల ఉద్యోగాలు

**నిర్మాణ, లాజిస్టిక్స్ రంగాలకు అధిక ప్రాధాన్యం**

**వెల్లడించిన కేంద్ర మంత్రి జైశంకర్**



మాస్కో: భారత్, రష్యా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడుతున్నాయి. ఈ ఏడాది సుమారు 70,000 మంది నైపుణ్యం కలిగిన భారతీయ కార్మికులకు తమ దేశంలో ఉపాధి కల్పించేందుకు రష్యా అంగీకరించింది. ముఖ్యంగా నిర్మాణ, లాజిస్టిక్స్ రంగాల్లో ఈ నియామకాలు జరగనున్నాయి. ఈ కీలక విషయాన్ని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్వయంగా వెల్లడించారు. పార్లమెంటరీ సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలిపారు. భారత్-రష్యా సంబంధాలపై జరిగిన ఈ సమావేశానికి జైశంకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, కనెక్టివిటీ, సాంస్కృతిక, ప్రజల మధ్య సంబంధాలు వంటి పలు అంశాల్లో ఇరు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని వివరించారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత సమతుల్యంగా విస్తరించాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయని, ఇందులో భాగంగా ఏడు కీలక రంగాల్లో రష్యాకు భారత ఎగుమతులు పెంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఆటోమొబైల్స్, ఫార్మాస్యూటికల్స్, ఆహార ఉత్పత్తులు, సముద్ర ఉత్పత్తులు, ఇంజినీరింగ్ వస్తువులు, రసాయనాలు, టెక్స్‌టైల్స్ రంగాల్లో ఈ అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఇంధన సహకారంపై మాట్లాడుతూ.. బహుళ వనరుల నుంచి ఇంధన సరఫరాలను కొనసాగించడం ద్వారా భారత వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని జైశంకర్ స్పష్టం చేశారు. చెన్నై-వ్లాదివోస్టాక్ కారిడార్, అంతర్జాతీయ నార్త్-సౌత్ ట్రాన్స్‌పోర్ట్ కారిడార్, నార్తర్న్ సీ రూట్ వంటి కనెక్టివిటీ ప్రాజెక్టులపైనా సమావేశంలో చర్చించారు. భారత్-యురేషియన్ ఎకనామిక్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదుర్చుకునే అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. ఇదే సమయంలో ఉక్రెయిన్ సంక్షోభంపై భారత్ దౌత్యపరమైన ప్రయత్నాలను జైశంకర్ కమిటీకి వివరించారు. చర్చలు, శాంతియుత పరిష్కారానికి భారత్ ఎల్లప్పుడూ మద్దతిస్తుందని పునరుద్ఘాటించారు. రష్యా సైన్యంలో సహాయక విధుల పేరుతో చిక్కుకున్న భారతీయ పౌరుల విడుదల కోసం చేస్తున్న ప్రయత్నాలను కూడా ఆయన సభ్యులకు తెలియజేశారు. ఇప్పటి వరకు సుమారు 140 మందిని సురక్షితంగా విడిపించామని, మరో 55 మంది ఆచూకీ కోసం రష్యా అధికారులతో చర్చిస్తున్నామని తెలిపారు.

## బీమా పాలసీల తికమకకు చెక్!

**సులభంగా అర్థమయ్యే ఫార్మాట్ తేవాలి**

**ఐఆర్‌డీఏఐ విప్లవాత్మక సంస్కరణలు**

న్యూఢిల్లీ: ఇన్సూరెన్స్ పాలసీ వివరాలు తెలుసుకోవడానికి ఇకపై కస్టమర్లు తమ ఫోన్ నంబర్, ఈ-మెయిల్ లేదా ఇతర వ్యక్తిగత వివరాలు ఇవ్వాల్సిన అవసరం లేకుండా చేయాలని భారత బీమా నియంత్రణ, అభివృద్ధి అథారిటీ (ఐఆర్‌డీఏఐ) సంచలనాత్మక సంస్కరణలను ప్రతిపాదించింది. పాలసీ ఫీచర్లు, ప్రీమియం రేట్లు, క్లెయిమ్‌ల సమాచారం, బ్రోచర్లు, ఉత్పత్తి పనితీరు, ఫిర్యాదుల పరిష్కారం వంటి వివరాలను ఒకే విధమైన, సులభంగా అర్థమయ్యే ఫార్మాట్‌లో అందించాలని బీమా సంస్థలు, పంపిణీదారులను కోరింది. ముఖ్యంగా, ప్రాథమిక సమాచారం చూపించే ముందు వ్యక్తిగత వివరాలు తీసుకుని, ఆ సమాచారాన్ని సేల్స్ లీడ్‌గా మార్చే విధానాన్ని 'డార్క్ ప్యాటర్న్'గా పరిగణించి, అలాంటి పద్ధతులను నిషేధించాలని స్పష్టం చేసింది. వినియోగదారుల డేటాను లీడ్ జనరేషన్ మార్గంగా వాడుకోకుండా నిరోధించడమే కాకుండా, ఎలాంటి వ్యక్తిగత వివరాలు ఇవ్వకుండానే ప్రీమియం రేట్లు, ఎఫ్ఏక్యూలు, ఫ్యాక్ట్ షీట్లు, కంపెనీల క్లెయిమ్ సెటిల్‌మెంట్ పనితీరును సులభంగా సరిపోల్చుకునే పారదర్శక విధానాన్ని ఐఆర్‌డీఏఐ అందుబాటులోకి తెస్తోంది. ప్రస్తుతం ధర, పాలసీ పనితీరు, క్లెయిమ్‌ల వంటి కీలక అంశాలపై సమాచారం సులభంగా పోల్చుకునే అవకాశం లేకపోవడం వల్ల కస్టమర్-బీమా సంస్థల మధ్య సమాచార అంతరం పెరుగుతోంది. దీన్ని తగ్గించి, ధర, నాణ్యత, క్లెయిమ్ రికార్డు వంటి అంశాలను చూసి కస్టమర్ నిర్ణయం తీసుకునేలా మార్కెట్‌ను మార్చడమే ఈ ప్రతిపాదనల ప్రధాన ఉద్దేశమని ఐఆర్‌డీఏఐ చైర్మన్ అజయ్ సేథ్ అభిప్రాయపడ్డారు.



ఈవార్తలు
# వినోదవాణి
CINEMA
సోమవారం 5-10-2026, జగిత్యాల | www.evarthalu.com | 6

వయ్యారి చిత్రం



## సింగీతంకు కన్నీటి వీడ్కోలు

**చెన్నైలో ముగిసిన అంత్యక్రియలు**



భారతీయ సినీ యవనికపై తనదైన ముద్ర వేసిన విలక్షణ దర్శకుడు, లెజెండరీ ఫిలింమేకర్ సింగీతం శ్రీనివాసరావు అంత్యక్రియలు ముగిశాయి. చెన్నైలో ఆదివారం సాయంత్రం ఆయన అంత్యక్రియలు చెన్నైలోని నేసపాక్కం శ్మశానవాటికలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సినీ ప్రముఖుల అశ్రునయనాల మధ్య పూర్తయ్యాయి. భారతీయ సినిమాకు దశాబ్దాల పాటు విశేష సేవలందించిన ఓ మహోన్నత అధ్యాయం ఆయన మరణంతో ముగిసినట్లయింది. వయోభారంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సింగీతం శ్రీనివాసరావు (94), చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. అనంతరం ఆయన భౌతికకాయాన్ని చెన్నై విరుగంబాక్కంలోని ఆయన నివాసానికి తరలించారు. ఆదివారం ఉదయం నుంచి పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు ఆయన నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి నివాళులర్పించారు. సింగీతంతో ఎన్నో చారిత్రక చిత్రాల్లో పనిచేసిన విశ్వనటుడు కమల్ హాసన్, ఆయన నివాసానికి చేరుకుని తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. సింగీతం కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సింగీతం మరణం పట్ల భారతీయ సినీ పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. దర్శకులు ఎస్.ఎస్. రాజమౌళి, మెగాస్టార్ చిరంజీవి, నందమూరి బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్, మహేశ్ బాబు వంటి ఎందరో అగ్ర తారలు, సాంకేతిక నిపుణులు సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటించారు. భారతీయ సినిమాలో ప్రయోగాలకు, నూతన ఒరవడులకు సింగీతం శ్రీకారం చుట్టారని, ఆయన లేని లోటు పూడ్చలేనిదని కొనియాడారు.

## బీచ్‌లో పెళ్లి చేసుకుందామనుకున్నా



విజయ్ దేవరకొండ ఈ ఏడాది ఫిబ్రవరిలో పెళ్లి చేసుకున్నాడు. ఎన్నాళ్ల నుంచి ప్రేమించిన హీరోయిన్ రష్మికతో కొత్త జీవితం మొదలుపెట్టాడు. అయితే ఈ వివాహ వేడుకలో విజయ్.. మెడలో బంగారు నగలు వేసుకుని రావడం చిత్రంగా అనిపించింది. అయితే ఇదంతా తన ప్లాన్‌లో లేదని బీచ్‌లో షార్ట్స్ వేసుకుని పెళ్లి చేసుకుందామని అనుకున్నట్లు ఓ షాకింగ్ విషయాన్ని బయటపెట్టాడు. గతంలో గీతగోవిందం, డియర్ కామ్రేడ్ సినిమాల్లో విజయ్-రష్మిక జంటగా నటించారు. కానీ పెళ్లి తర్వాత 'రణబాలి' కోసం స్క్రీన్ షేర్ చేసుకున్నారు. వచ్చే శుక్రవారం(అక్టోబర్ 16) థియేటర్లలో రిలీజ్ కానుంది. దీని ప్రమోషన్లలో భాగంగా సుమతో చేసిన ఇంటర్వ్యూలో విజయ్ దేవరకొండ తాను ఎలా పెళ్లి చేసుకోవాలనుకున్నాను? ఎలా జరిగింది? అనే విషయాల గురించి చెప్పాడు. 'నేను సింపుల్‌గా బీచ్‌లో షార్ట్స్ వేసుకుని పెద్దగా హడావుడి లాంటివి చేయకుండా పెళ్లి చేసుకుందామనుకున్నాను. కానీ ఇది తెలిసి మా అమ్మ నన్ను రెండు కొట్టింది. పదిరోజుల పాటు ఇంట్లో ఏడ్చింది.

## జాన్వీ ఏఐ వీడియోపై కేసు నమోదు



దేవర సినిమాలోని సూపర్‌హిట్ సాంగ్'చుట్టమల్లే'కు సంబంధించి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఏఐ మార్ఫింగ్ వీడియోపై టాలీవుడ్ స్టార్ యాక్టర్ జూనియర్ ఎన్టీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడని తెలిసిందే. ఈ సాంగ్‌లో జాన్వీ కపూర్ కనిపించిన సన్నివేశాలను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని ఉపయోగించి అత్యంత అసభ్యకరంగా మార్ఫింగ్ చేయడం పట్ల తారక్‌తోపాటు పలువురు యాక్టర్లు విచారం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో జాన్వీ కపూర్ ఏఐ వీడియోపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నమోదు చేశారు. ఏఐ మార్ఫింగ్ వీడియోల వెనుకున్నదెవరు, ఎక్కడి నుంచి వచ్చాయనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు సమాచారం.

## ప్రభాస్ బర్త్‌డేకు మూడు సినిమాల సర్‌ప్రైజ్‌లు!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులకు అక్టోబర్ 23 ఎంతో ప్రత్యేకమైన రోజు. తమ అభిమాన హీరో పుట్టినరోజు సందర్భంగా ప్రతిసారి ఏదో ఒక ప్రత్యేకమైన కానుక కోసం ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ఈసారి ప్రభాస్ చేతిలో వరుసగా భారీ ప్రాజెక్టులు ఉండటంతో.. బర్త్‌డే సందర్భంగా మరిన్ని సర్‌ప్రైజ్‌లు వచ్చే అవకాశం ఉందనే ప్రచారం మొదలైంది. ప్రస్తుతం ప్రభాస్ 'ఫౌజీ', 'స్పిరిట్', 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ వంటి ప్రతిష్టాత్మక చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ మూడు సినిమాలపై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. దీంతో అక్టోబర్ 23న ప్రభాస్ పుట్టినరోజును పురస్కరించుకుని ఈ ప్రాజెక్టులకు సంబంధించి కీలక అప్‌డేట్స్ ఇచ్చేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారనే వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

## జాన్వీ వీడియోకు సెలబ్రిటీలే ప్రచారం చేశారు



సంచలన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ మరోసారి తనదైన శైలిలో స్పందించారు. 'దేవర' సినిమాలోని 'చుట్టమల్లే' పాటకు సంబంధించి నటి జాన్వీ కపూర్ డీప్‌ఫేక్ వీడియోపై ఆయన చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. ఈ వివాదంపై స్పందించిన సినీ ప్రముఖులు, దానికి అనవసర ప్రచారం కల్పించారని వర్మ తీవ్రంగా విమర్శించారు. ఈ అభ్యంతరకర వీడియోపై పలువురు సెలబ్రిటీలు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడాన్ని ఆర్జీవీ తప్పుపట్టారు. వారి వరుస ట్వీట్ల వల్ల ఆ వీడియో గురించి తెలియని వారికి కూడా తెలిసిందని, ఫలితంగా కోట్లాది మంది దాని కోసం వెతికి చూసేలా చేశారని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది బాధితురాలికి సహాయపడటం కాదని, మరింత నష్టం కలిగించడమేనని అన్నారు. "నిజంగా చేయాల్సింది వేరు. సైబర్ క్రైమ్ పోలీసుల సహాయంతో ఆ నీచమైన పని చేసిన వ్యక్తిని పట్టుకోవాలి. వాడిని పట్టుకున్న తర్వాత ఆ విషయాన్ని ప్రచారం చేస్తే ఒక అర్థం ఉంటుంది. కానీ అలా చేయకుండా, బాధితురాలి పేరును హైలైట్ చేస్తూ పోస్టులు పెట్టారు" అని వర్మ విమర్శించారు. బాధితురాలి గుర్తింపును ఇలా బహిరంగంగా ప్రచారం చేయడం కూడా చట్టపరంగా నేరమే అవుతుందని ఆయన స్పష్టం చేశారు. మొత్తం మీద సెలబ్రిటీల స్పందన న్యాయం చేయడం కంటే, ఆ అభ్యంతరకర కంటెంట్‌కు ఉచిత ప్రచారం కల్పించినట్లుగా ఉందని ఆర్జీవీ తన వ్యాఖ్యల ద్వారా స్పష్టం చేశారు.

## రేప్‌తో సమానం



'దేవర' సినిమాలోని 'చుట్టమల్లే..' పాటను ఏఐ సాంకేతికతతో అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి వైరల్ చేయడంపై చిత్ర పరిశ్రమ తీవ్రంగా స్పందిస్తోంది. మహిళలను కించపరిచేలా ఇలాంటి కంటెంట్ రూపొందించడాన్ని పలువురు సినీ ప్రముఖులు ఖండించారు. ఎన్టీఆర్, చిరంజీవి, విజయ్ దేవరకొండ, ఖుష్బూ తదితరులు ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కథానాయిక జాన్వీ కపూర్ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. 'ఏఐ సాంకేతికతను ఉపయోగించి మహిళలను కించపరిచేలా కంటెంట్‌ను రూపొందించి, ప్రచారం చేయడం అత్యంత అవమానకరమైన విషయం. ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరం. ఇది లైంగిక వేధింపులకు ఏమాత్రం తీసిపోని తీవ్రమైన ఉల్లంఘన. చిత్ర పరిశ్రమలోని ప్రతి నటి ఏదో ఒక రూపంలో ఇలాంటి అనుభవాలను ఎదుర్కొంటూనే ఉంది. ఒక మహిళకు, ఆమె శరీరానికి గౌరవం ఇవ్వడం మానవత్వంలో అత్యంత ప్రాథమికమైన విషయం. ఒక మహిళ 'వద్దు' అని చెబితే ఆ నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలి. ఆమె ఎలాంటి దుస్తులు ధరించాలి? తన శరీరానికి సంబంధించిన నిర్ణయాలు ఎలా తీసుకోవాలి? అనేది పూర్తిగా ఆమె వ్యక్తిగత హక్కు. ఒక మహిళ మినీ స్కర్ట్ ధరించిందని, ఆమెను అసభ్యకరంగా చిత్రీకరించడానికి అనుమతి ఇచ్చినట్లు కాదు' అని జాన్వీ పేర్కొన్నారు.



## భారీ యాక్షన్ సీన్!

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్‌స్టార్ మహేష్ బాబు కలయికలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతుండగా.. సినిమాలోని కీలక యాక్షన్ సన్నివేశాల కోసం భారీ స్థాయిలో సన్నాహాలు జరుగుతున్నట్లు సమాచారం. 'వారణాసి'లోని ఓ ప్రత్యేక యాక్షన్ సీక్వెన్స్ కోసం రామోజీ ఫిల్మ్ సిటీలో భారీ సెట్‌ను నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సెట్‌లో మహేష్ బాబుతో పాటు సినిమాలోని ఇతర ప్రధాన పాత్రలపై కీలక యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు సమాచారం. ఈ పోరాట ఘట్టాలు ఇప్పటివరకు రాజమౌళి తెరకెక్కించిన యాక్షన్ సన్నివేశాలకు భిన్నంగా, మరింత భారీగా, వైల్డ్‌గా ఉండనున్నాయని చిత్ర వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.



## సెక్స్ వర్కర్లనే తప్పు పడతారు: సమంత

మా ఇంటి బంగారంతో సూపర్ హిట్ కొట్టిన టాలీవుడ్ బ్యూటీ సమంత. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. నందిని రెడ్డి దర్శకత్వం వచ్చిన ఈ చిత్రం ఆడియన్స్ ఆదరణ దక్కించుకుంది. తర్వాత సమంత అభిమానులకు మరో గుడ్ న్యూస్ చెప్పింది. తాను ప్రెగ్నెన్సీతో ఉన్నానని ప్రకటించి డబుల్ సర్‌ప్రైజ్ ఇచ్చింది. ప్రస్తుతం ప్రెగ్నెన్సీ లైఫ్‌ను ఆస్వాదిస్తోంది. అయితే ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో అభిమానులతో టచ్‌లోనే ఉంటోంది. ఈసారి సమాజంలో మహిళలపై జరిగే అన్యాయాలపై పోస్ట్ చేశారు. 'సమాజంలో లైంగిక కార్మికులను తప్పుపడతారు. కానీ వారి దగ్గరికి వెళ్లేవారిని ఏమీ అనరు. ఒంటరి తల్లులను విమర్శిస్తారు. కానీ పిల్లల బాధ్యత తీసుకోని తండ్రులను ఎవరూ అడగని కూడా అడగరు. అత్యాచారం జరిగినప్పుడు బాధితురాలినే తప్పుపడతారు. కానీ తప్పు చేసిన వారిని ప్రశ్నించరు' అని అలాంటి సమాజంలో మనం బతుకుతున్నాం అంటూ సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెడుతూ అసహనం వ్యక్తం చేశారు.



## రోహిత్ సాధించాలి

వెస్టిండీస్ తో చివరి వన్డేలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ అద్భుత ఫామ్‌తో 92 పరుగులు చేసినప్పటికీ, భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ మాత్రం అసంతృప్తి వ్యక్తం చేశాడు. సెంచరీకి కేవలం 8 పరుగుల దూరంలో రోహిత్ ఔట్ కావడం తనను నిరాశపరిచిందని అన్నాడు. రోహిత్ శర్మ తన కెరీర్‌ను ఓ ప్రత్యేకమైన మైలురాయితో ముగించాలని తాను కోరుకుంటున్నట్లు గవాస్కర్ ఒక ఆసక్తికర లక్ష్యాన్ని నిర్దేశించాడు. జియోస్టార్‌లో ప్రసారమైన 'హయర్ క్రికెట్ లైవ్' కార్యక్రమంలో గవాస్కర్ మాట్లాడుతూ.. "2027 వన్డే ప్రపంచకప్ తర్వాత సుమారు 40 ఏళ్ల వయసులో రోహిత్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికే అవకాశం ఉంది. నా వ్యక్తిగత కోరిక ఏంటంటే.. అతను రిటైర్ అయ్యే నాటికి అతని వయసు కన్నా ఎక్కువ వన్డే సెంచరీలు చేయాలి. ప్రస్తుతం రోహిత్ ఖాతాలో 35 సెంచరీలు ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో శతకం పూర్తి చేసి ఉంటే, ఆ సంఖ్య 36కు చేరేది. తద్వారా 40 సెంచరీల మార్క్‌కు మరింత దగ్గరయ్యేవాడు" అని అభిప్రాయపడ్డాడు. ఈ సందర్భంగా తన కెరీర్‌లోని చివరి దశను గవాస్కర్ గుర్తుచేసుకున్నాడు. "నాకు 38 ఏళ్ల వయసులో, టెస్టుల్లో 38 సెంచరీలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. కానీ దురదృష్టవశాత్తు మూడుసార్లు 90ల్లో ఔటయ్యాను. అందుకే రోహిత్ సెంచరీ మిస్ కావడం చూసి నిరాశ చెందాను. నేను సాధించలేకపోయాను.. రోహిత్ అయినా ఆ ఘనత అందుకోవాలి" అని అభిలషించాడు. అదే సమయంలో 2023 ప్రపంచకప్ తర్వాత రోహిత్ బ్యాటింగ్ శైలిలో మార్పు వచ్చిందని గవాస్కర్ విశ్లేషించాడు. "ప్రపంచకప్‌లో మొదటి బంతి నుంచే దూకుడుగా ఆడేవాడు. ఇప్పుడు తన వికెట్‌కు ఎక్కువ విలువ ఇస్తున్నాడు. ఇది మంచి పరిణామమే. అయినా, రోహిత్‌ను నేను 30-40 పరుగులు చేసే ఆటగాడిగా కాకుండా, 'సెంచరీల వీరుడు'గానే చూస్తాను" అని స్పష్టం చేశాడు.

### 'ఇరానీ' విజేతగా
## రెస్టాఫ్ ఇండియా

భారత వన్డే జట్టులో చోటు కోల్పోయిన రిషభ్ పంత్ దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటాడు. ఆటగాడిగా ధనాధన్ బ్యాటింగ్‌తో అలరించే పంత్ ఈసారి కెప్టెన్‌గా రెస్టాఫ్ ఇండియాకు టైటిల్ అందించాడు. ఇరానీ కప్ ఫైనల్లో ముకేశ్ కుమార్(2-84, 33-6) ఎనిమిది వికెట్లతో విరచుకుపడగా.. పంత్ సారథ్యంలోని రెస్టాఫ్ ఇండియా 167 పరుగుల తేడాతో జమ్ము కశ్మీర్‌ను ఓడించింది. దాంతో రికార్డు స్థాయిలో ముప్పయ్యోసారి ట్రోఫీని ముద్దాడింది. ఇరానీ ట్రోఫీ 2026-27 ఫైనల్లో రెస్టాఫ్ ఇండియా అదరగొట్టింది. రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్ సనత్ సాంగ్వన్(55) అర్ధ శతకంతో శుభారంభమివ్వగా.. స్మరణ్ రవిచంద్రరన్(135) సూపర్ సెంచరీతో కదం తొక్కాడు. అనంతరం 279 పరుగుల ఛేదనలో జమ్ము కశ్మీర్ బ్యాటర్లను పేసర్ ముకేశ్ కుమార్ (2-84, 33-6) వణికించాడు. బుల్లెట్ బంతులతో నిప్పులు చెరిగిన ముకేశ్ ఏకంగా ఆరుగుని ఔట్ చేసి ప్రత్యర్థిని కోలుకోలేని దెబ్బతీశాడు. దాంతో.. జమ్ము 111 రన్స్‌కే కుప్పకూలింది. ఆల్‌రౌండ్ షోతో కనబరిచి 167 పరుగుల తేడాతో గెలుపొందిన రెస్టాఫ్ ఇండియా 30వ సారి ఈ టోర్నీలో ఛాంపియన్‌గా నిలిచింది. తద్వారా జట్టుకు ట్రోఫీ కట్టబెట్టిన రెండో వికెట్ కీపర్‌గా పంత్ గుర్తింపు సాధించాడు. ఖతర్నాక్ శతకంతో విజయంలో భాగమైన స్మరణ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు.

### ధోనీ సలహాతో
## భారత్‌ను ఓడించా



నామమాత్రమైన మూడో వన్డేలో అద్భుత శతకంతో క్వీన్‌స్వీప్ తప్పించాడు వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్. భారత బౌలర్లను కాచుకొని అజేయంగా నిలిచి అతడు జట్టును గెలిపించిన తీరుపై ప్రశంసలు కురుస్తున్నాయి. మ్యాచ్ అనంతరం బహుమతి ప్రదానం సందర్భంగా హోప్ మాట్లాడుతూ.. భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ సలహాతోనే టీమిండియాను ఓడించానని చెప్పాడు. కొన్ని రోజుల క్రితం ధోనీ చెప్పిన మాటలే తనను మ్యాచ్ విన్నర్‌ను చేశాయని వెల్లడించాడీ విండీస్ సారథి. వరసగా రెండో వన్డేల్లో కంగుతిన్న వెస్టిండీస్ ఛండీగఢ్‌లో గొప్పగా పోరాడింది. కెప్టెన్ షాయ్ హోప్(162 నాటౌట్) సూపర్ సెంచరీతో కదంతొక్కగా వైట్‌వాష్ తప్పించుకుంది విండీస్. భారత బౌలర్ల సహనాన్ని పరీక్షిస్తూ క్రీజులో పాతుకుపోయిన హోప్..



# ఘనంగా ముగిసిన ఆసియా గేమ్స్








### భారత పతాకధారిగా నీరూ ధండా

*రెండు వారాల పాటు క్రీడా ప్రియులను అలరించిన ఆసియా గేమ్స్ ఆదివారంతో ముగిశాయి. ఈ నేపథ్యంలో జపాన్‌లో నగోయా సిటీ మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో అంగరంగ వైభవంగా ముగింపు వేడుకలు జరిగాయి. అనంతరం "ఒకే ఆసియా" అనే సందేశాన్ని ముందుకు తీసుకువెళ్తూ, ఐచి-నగోయా 2026 నుంచి ఖతార్‌లో జరగబోయే తదుపరి క్రీడల కోసం ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా పతాకాన్ని అధికారికంగా దోహా 2030కి అప్పగించారు.*

ఈసారి క్రీడల్లో 85 పతకాలు సాధించిన భారత్ ఖాతాలో 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలున్నాయి. 2023 ఆసియా గేమ్స్‌లో 106 పతకాలు సాధించి సెంచరీ మార్క్‌ను దాటిన భారత్ జపాన్‌లో మాత్రం ఆ ఫీట్‌కు 15 పతకాల దూరంలోనే ఆగిపోయింది. అయితే పతకాల పట్టికలో మాత్రం తమ నాలుగో స్థానాన్ని నిలబెట్టుకుంది. ఇక భారత్ తరఫున పతాకధారిగా నీరూ ధండా వ్యవహరించింది. ఆసియా గేమ్స్‌లో అద్భుత ప్రదర్శనతో మూడు పతకాలు సాధించిన నీరు ధండాకు భారత ఒలింపిక్ అసోసియేషన్ అరుదైన గౌరవాన్ని అందించింది. తన పోటీలు ముగిసిన తర్వాత భారతదేశానికి చేరుకున్న నీరూ ధండా ముగింపు వేడుకల్లో పతకాధారిగా భారత బృందాన్ని ముందుండి నడిపించేందుకు శనివారమే తిరిగి జపాన్‌కు చేరుకుంది. ఈ నేపథ్యంలో ముగింపు వేడుకల్లో నీరూ ధండా భారత త్రివర్ణ పతకాన్ని చేతబూని భారత బృందాన్ని నడిపించారు. ఇక ఆసియా క్రీడల చరిత్రలో వ్యక్తిగత ట్రాప్ షూటింగ్‌లో స్వర్ణం సాధించిన తొలి భారత మహిళా షూటర్‌గా నీరూ ధండా సరికొత్త రికార్డు సృష్టించింది. ఈసారి పోటీల్లో నీరూ రెండు స్వర్ణాలు, ఒక రజతం సాధించింది. మహిళల వ్యక్తిగత ట్రాప్ ఈవెంట్‌లో స్వర్ణం గెలిచిన నీరూ ధండా ట్రాప్ మిక్స్‌డ్ టీమ్ (క్రైనన్ చెనాయ్‌తో కలిసి) స్వర్ణం గెలిచింది. ఇక మహిళల టీమ్ ట్రాప్ (మనీషా కీర్, ఆషిమా అహ్లావత్‌లతో కలిసి) రజత పతకం సాధించింది. అయితే ఆసియా గేమ్స్ ప్రారంభానికి కొద్దిరోజుల ముందు ఆమె తీవ్రమైన వైరల్ జ్వరంతో బాధపడి, ఆసుపత్రిలో చేరింది. అయితే జ్వరం నుంచి కోలుకున్నప్పటికీ, నీరసంతో బాధపడుతూనే జపాన్‌కు వచ్చిన నీరూ ధండా మూడు పతకాలతో సత్తా చాటి దేశానికి గర్వకారణంగా నిలిచింది.

# పంత్‌కు ఢిల్లీ షాక్



రంజీ జట్టులో నో ప్లేస్

రంజీ ట్రోఫీ 2026-27 సీజన్ కోసం 16 మంది సభ్యుల ఢిల్లీ జట్టును ప్రకటించారు. ఈ జట్టుకు కెప్టెన్‌గా ఆయుష్ బదోని ఎంపిక కాగా.. స్టార్ ప్లేయర్ రిషబ్ పంత్‌కు చోటు దక్కలేదు. సెలెక్షన్‌కు అందుబాటులో ఉన్నా, పంత్‌ను ఎంపిక చేయకపోవడం చర్చనీయాంశమైంది. పంత్ పూర్తి సీజన్‌ను అందుబాటులో ఉండలేకపోయినా, కొన్ని మ్యాచ్‌లు అయినా అదే అవకాశం ఉంటుంది. అయినా సెలెక్టర్లు అతన్ని పట్టించుకోలేదు. పంత్ గత రంజీ సీజన్‌లోనూ ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. దానికి ముందు సీజన్‌లో కూడా ఒక్క మ్యాచ్‌లో మాత్రమే ఆడాడు. ఇరానీ కప్‌లో పంత్ రెస్ట్ ఆఫ్ ఇండియాకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న నేపథ్యంలో.. రంజీ ట్రోఫీలోనూ ఆడతాడనే అంచనాలు నెలకొన్నాయి. అయితే సెలెక్టర్లు అతన్ని పట్టించుకోకపోవడం అభిమానులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ప్రస్తుతం పంత్ భారత జట్టు మూడు ఫార్మాట్లలో సభ్యుడిగా లేడు. అతడు కేవలం టెస్ట్ జట్టులో మాత్రమే కొనసాగుతున్నాడు. భారత్ నవంబర్ 19 నుంచి న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్ ఆడుతుంది. దీనికి ముందు పంత్ రంజీల్లో ఆడితే జట్టుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అయినా ఢిల్లీ క్రికెట్ బోర్డు సెలెక్టర్లు పంత్‌ను రంజీ ట్రోఫీలో ఒక్క మ్యాచ్ ఆడేందుకు కూడా ఎంపిక చేయలేదు. గత సీజన్‌లో ఢిల్లీకి కెప్టెన్‌గా వ్యవహరించిన ఆయుష్ బదోనీనే ఈసారి కూడా జట్టు సారథిగా కొనసాగనున్నాడు. యశ్ ధుల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ప్రధాన వికెట్ కీపర్‌గా అనుజ్ రావత్ ఎంపికయ్యాడు. గత సీజన్‌లో ఢిల్లీ తరఫున అత్యధిక పరుగులు చేసిన ఆయుష్ దోసేజా, సనత్ సంగ్వాన్ కూడా తమ స్థానాలను నిలబెట్టుకున్నారు.

## ఇండో-పాక్ మ్యాచ్2కు అత్యధిక వ్యూయర్‌షిప్

జపాన్‌లోని ఐచి-నగోయా వేదికగా సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరిగిన 20వ ఆసియా క్రీడలు సరికొత్త చరిత్ర లిఖించాయి. ఈ క్రీడల చరిత్రలోనే అత్యధిక వ్యూయర్‌షిప్ దక్కించుకున్న మ్యాచ్‌లుగా దాయాది దేశాలు భారత్, పాకిస్తాన్‌ల మధ్య జరిగిన పురుషుల క్రికెట్ ఫైనల్, పురుషుల హాకీ సెమీఫైనల్ పోరాటాలు రికార్డు సృష్టించాయి. ఈ మేరకు ఆదివారం నగోయాలో ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ ఎడిషన్‌లో ఏకంగా 212 సరికొత్త గేమ్స్ రికార్డులు నమోదయ్యాయని, క్రీడాకారులకు ప్రపంచ స్థాయి అత్యుత్తమ వాతావరణం, వసతులు కల్పించామనడానికి ఈ గణాంకాలే నిదర్శనమని ఓసీఏ ప్రతినిధులు స్పష్టం చేశారు. చిరకాల ప్రత్యర్థుల సమరం క్రీడాభిమానులను టీవీలు, డిజిటల్ స్క్రీన్లకు కట్టిపడేసిందని కౌన్సిల్ కొనియాడింది. కాకమిగహారాలోని గిఫు ప్రిఫెక్చురల్ గ్రీన్ స్టేడియంలో జరిగిన పురుషుల హాకీ సెమీఫైనల్ అత్యంత ఉత్కంఠభరితంగా సాగింది. ఇందులో పాకిస్తాన్‌ను 4-3 తేడాతో మట్టికరిపించిన భారత జట్టు.. అనంతరం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మలేషియాను చిత్తు చేసి అద్భుతంగా స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. మరోవైపు ఐచి ప్రిఫెక్చురల్ కోరోగి స్పోర్ట్స్ పార్క్ వేదికగా జరిగిన పురుషుల టీ20 క్రికెట్ ఫైనల్లో టీమ్ ఇండియా 19 పరుగుల తేడాతో పాకిస్తాన్‌పై ఘన విజయం సాధించి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ రెండు కీలక పోరాటాల్లోనూ భారత జట్లు దాయాదిపై ఆధిపత్యం చెలాయించడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో క్రీడా ప్రపంచం దృష్టిని విపరీతంగా ఆకర్షించాయి.

## వైభవ్‌పై వేటు తప్పదా..!



ఏషియన్ గేమ్స్-2026 క్రికెట్ పోటీల్లో స్వర్ణం గెలుచుకున్న భారత పురుషుల జట్టు.. ఇప్పుడు స్వదేశంలో వెస్టిండీస్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడేందుకు సిద్ధమైంది. ఈ సిరీస్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య తొలి టీ20 మ్యాచ్ అక్టోబర్ 6న లక్నో వేదికగా జరగనుంది. అయితే ఈ మ్యాచ్‌లో భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో చోటు దక్కేది అనుమానంగానే మారింది. ఆసియా క్రీడల్లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచినప్పటికీ, జట్టు కూర్పు కారణాల వల్ల వైభవ్‌ను మరోసారి బెంచ్‌కే పరిమితం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. రెగ్యులర్ ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్‌లనే విండీస్‌తో సిరీస్‌లోనూ కొనసాగించనున్నట్లు సమాచారం. గతనెలలో అఫ్గానిస్తాన్‌తో జరిగిన సిరీస్‌లోనూ వైభవ్ మూడు మ్యాచ్‌లకు గాను డ్రింక్స్ బాయ్‌గానే పరిమితమయ్యాడు. పాకిస్తాన్‌తో ఫైనల్ మ్యాచ్ అనంతరం జియో హాట్‌స్టార్‌తో మాట్లాడిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ చేసిన వ్యాఖ్యలు ఈ వార్తలకు మరింత ఊతమిస్తున్నాయి. "ప్రస్తుతం మేము ప్రపంచకప్ గెలిచిన జట్టులోని ఓపెనర్లతోనే ముందుకు వెళ్తున్నాం. వారు ఆ స్థానానికి పూర్తిగా అర్హులు. ప్రస్తుతం వైభవ్ 15 మంది సభ్యుల జట్టులోనే ఉన్నాడు కాబట్టి అతడికి భవిష్యత్తులో ఖచ్చితంగా అవకాశాలు వస్తాయి. అవకాశం వచ్చినప్పుడు అతడు మైదానంలో ఖచ్చితంగా ఆధిపత్యం చెలాయిస్తాడనే నమ్మకం ఉంది" అని శ్రేయస్ వెల్లడించాడు. వైభవ్‌తో తనకున్న బంధం గురించి మాట్లాడుతూ.. "నేను వైభవ్‌తో చాలా క్లోజ్‌గా ఉంటాను. అందరూ అతనితో ఎప్పుడూ క్రికెట్ గురించే మాట్లాడుతుంటారు, కానీ నేను మైదానం వెలుపల అతడి జీవనశైలి, కుటుంబం, ఇతర విషయాల గురించి ఎక్కువగా చర్చిస్తాను. అది అతనికి ఎంతో ఉత్సాహాన్ని ఇస్తుంది. అతడు చూడటానికి చాలా సైలెంట్‌గా ఉంటాడు కానీ. మైదానంలో మాత్రం ప్రత్యర్థులపై విరుచుకుపడతాడు. డ్రెసింగ్ రూమ్‌లో కూడా చాలా సరదాగా ఉంటాడు" అని అయ్యర్ పేర్కొన్నాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
సోమవారం 5-10-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# వైట్ కాలర్ ఉగ్రవాదం!

ఉగ్రవాదం అంటే ఇక బాంబులు.. తుపాకులు.. ముఖాలకు ముసుగులు.. అడవుల్లో దాక్కున్న ముష్కరులు మాత్రమే కాదు. కొన్నిసార్లు అది కోటు వేసుకుని వస్తుంది. చేతిలో తుపాకీ ఉండకపోవచ్చు. ముఖంలో అనుమానం కనిపించకపోవచ్చు. బయటికి చూస్తే అత్యంత బాధ్యతాయుతమైన ఉద్యోగం చేస్తూ ఉండొచ్చు. కానీ ఒక్క క్షణంలో వందల మంది ప్రాణాలను పణంగా పెట్టగలదు. ఫ్లైదుబాయ్ విమానంలో జరిగిన ఘటన ప్రపంచానికి ఇలాంటి కొత్త భయాన్ని చూపించింది. దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న విమానంలో సహవిమానికుడు కాక్‌పిట్‌లోనే కెప్టెన్‌పై దాడి చేశాడు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే గొడ్డలితో దాడి చేసినట్లు యూఏఈ దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. విమానం ఒక్కసారిగా వేల అడుగుల ఎత్తు కోల్పోయింది. కాక్‌పిట్‌లోని పైలట్‌నే దాడి చేస్తే.. విమానాన్ని ఎవరు కాపాడాలి? కొన్ని క్షణాల పాటు ఆ ప్రశ్నకు సమాధానం లేకుండా పోయింది. అక్కడే ఈ ఘటన భయానకత అర్థమవుతుంది. విమానాన్ని కూల్చడానికి బయట నుంచి ఎవరూ చొరబడాల్సిన అవసరం లేదు. విమానాన్ని నడిపే వ్యక్తే దాన్ని ఆయుధంగా మార్చేస్తే? ఇదే అసలు ప్రమాదం. ఇది కేవలం విమాన భద్రతకు సంబంధించిన సమస్య కాదు. ఆధునిక ప్రపంచం ఎదుర్కొంటున్న "లోపలి ముప్పు"కు ఇది ఒక తీవ్రమైన ఉదాహరణ. భద్రతా వ్యవస్థలు బయట నుంచి వచ్చే ఉగ్రవాదిని గుర్తించడంలో ఎంత అప్రమత్తంగా ఉన్నా.. వ్యవస్థలోకే ఒక ప్రమాదకర వ్యక్తి చేరితే పరిస్థితి ఎంత క్లిష్టంగా మారుతుందో ఈ ఘటన గుర్తుచేస్తోంది. మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే.. దాడికి పాల్పడ్డ సహవిమానికుడి గతం, అతడిపై గతంలో వ్యక్తమైన భద్రతా అనుమానాలు, విమానయాన సంస్థల నియామక ప్రక్రియపై ఇప్పుడు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే అతడి ఉద్దేశాలు, గత కార్యకలాపాలు, ఇతర సంస్థలతో సంబంధాలపై దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. కాబట్టి నిర్ధారణ కాని విషయాలను నిజాలుగా ప్రచారం చేయడం కూడా ప్రమాదకరమే. కానీ ఒక ప్రశ్న మాత్రం తప్పదు. ఒక వ్యక్తిపై ఎక్కడైనా భద్రతా అనుమానం వ్యక్తమైతే.. ఆ సమాచారం తర్వాత అతను చేరే ప్రతి వ్యవస్థకు చేరుతోందా? విమానయానం కావచ్చు. వైద్యం కావచ్చు. అణు పరిశ్రమ కావచ్చు. విద్యుత్ వ్యవస్థ కావచ్చు. రక్షణ రంగం కావచ్చు. సమాచార సాంకేతిక వ్యవస్థ కావచ్చు. ప్రతి రంగంలోనూ కీలక బాధ్యతలు నిర్వహించే వ్యక్తుల విషయంలో నియామకం ఒక్కటే సరిపోదు. నిరంతర భద్రతా పరిశీలన, ప్రవర్తనా మార్పుల గుర్తింపు, విశ్వసనీయమైన సమాచార భాగస్వామ్యం అవసరం. ఎందుకంటే తెల్లకాలర్ వేసుకున్న వ్యక్తి ప్రమాదకారి కాదనే హామీ ఏదీ లేదు. అయితే దీనిని ప్రతి వృత్తిపరుడిపై అనుమానం పెంచే సాధనంగా మార్చకూడదు. మతం, దేశం, జాతి, భాష ఆధారంగా అనుమానించడం మరింత ప్రమాదకరం. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాల్సింది ఆధారాలతో.. నిఘాతో.. సమర్థమైన వ్యవస్థలతో. ఫ్లైదుబాయ్ ఘటనలో ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపించింది. కాక్‌పిట్ తలుపులు ఎంత బలంగా ఉన్నా.. ఆ తలుపుల లోపల ఉన్న వ్యక్తి నుంచే ముప్పు వస్తే పాత భద్రతా నమూనాలు సరిపోవు. విమాన భద్రత అంటే ప్రయాణికుల తనిఖీలు, సామాన్ల తనిఖీలతోనే పూర్తికాదని ఈ ఘటన మరోసారి నిరూపించింది. మరోవైపు సామాజిక మాధ్యమాల్లో ఈ ఘటనపై ఇప్పటికే తప్పుడు సమాచారం, నకిలీ వీడియోలు కూడా ప్రచారంలోకి వచ్చాయి. భారతీయ ప్రయాణికుడిని ఈ దాడితో ముడిపెడుతూ ప్రసారం చేసిన ఒక నకిలీ బీబీసీ వీడియోను వాస్తవ నిర్ధారణ సంస్థలు తప్పుబట్టాయి. అంటే ఉగ్రదాడి తర్వాత వచ్చే తప్పుడు ప్రచారం కూడా మరో రకమైన ప్రమాదమే. ఒక తప్పుడు వార్త.. ఒక మతంపై ద్వేషం.. ఒక వర్గంపై అనుమానం.. ఒక దేశంపై ఆగ్రహం.. ఇవి కూడా సమాజంలో మరో అగ్నిని రాజేయగలవు. అందుకే ఫ్లైదుబాయ్ ఘటనను కేవలం ఒక విమానంలో జరిగిన దాడిగా చూడకూడదు. ఇది భద్రతా వ్యవస్థలకు వచ్చిన హెచ్చరిక. ఉగ్రవాదం తన రూపాన్ని మార్చుకుంటోంది. బాంబు సంచీ స్థానంలో ఉద్యోగ గుర్తింపు కార్డు రావచ్చు. తుపాకీ స్థానంలో అధికారిక పరికరం ఉండొచ్చు. బయటి వ్యక్తి స్థానంలో వ్యవస్థలో భాగమైన వ్యక్తే ఉండొచ్చు. అందుకే భద్రతా వ్యవస్థల ముందున్న సవాలు కూడా మారాలి. ఎవరు బయట నుంచి వస్తున్నారు? అన్న ప్రశ్నతో పాటు.. ఎవరు మన వ్యవస్థలో ఉన్నారు? వారిని మనం ఎంతవరకు తెలుసుకున్నాం? వారి గురించి వచ్చిన హెచ్చరికలు ఎక్కడ ఆగిపోయాయి? ఒక వ్యవస్థ నుంచి మరొక వ్యవస్థకు భద్రతా సమాచారం ఎందుకు చేరలేదు? అన్న ప్రశ్నలకు సమాధానాలు వెతకాలి. ఫ్లైదుబాయ్ విమానం ఆకాశంలో కూలిపోలేదు. కానీ కొన్ని క్షణాల పాటు ప్రపంచం ఒక పెను మారణహోమం అంచున నిలిచింది. ఒక్క క్షణం ఆలస్యమైతే 182 మంది ప్రాణాలు ఏమయ్యేవి? ఈ ప్రశ్నకు సమాధానం భయపెట్టడానికి కాదు.. భవిష్యత్తును కాపాడుకోవడానికి కావాలి. చడీచప్పుడు లేకుండా వచ్చే ముప్పును ముందే గుర్తించాలి. లేకపోతే.. మారణహోమం జరిగిన తర్వాత భద్రతా లోపాలను లెక్కపెట్టుకోవడం వల్ల ప్రయోజనం ఏముంటుంది?



# అప్పు చేసైనా అంతస్థుల్లోనే..!

హైదరాబాద్ రూపురేఖలు మారుతున్నాయి. ఆకాశహర్మ్యాలు పెరుగుతున్నాయి. వాటితో పాటు మనుషుల ఆశలూ అంతస్థులు ఎక్కుతున్నాయి. ఇప్పుడు ఇల్లు అంటే కేవలం నివాసం కాదు. ఎంత పెద్ద ఇల్లు? ఏ ప్రాంతంలో? ఎన్ని అంతస్థులు? ఎలాంటి వసతులు? అన్నదే స్థాయి కొలమానంగా మారుతోంది.

జీతం లక్షల్లో లేకపోయినా ఫర్వాలేదు.. బ్యాంకు అప్పు ఇస్తే చాలు.. కారు కావాలి.. ఖరీదైన ఫర్నిచర్ కావాలి.. గేటెడ్ కమ్యూనిటీలో ఫ్లాట్ కావాలి.. పిల్లలకు అంతర్జాతీయ పాఠశాల కావాలి.. ఆదాయం కంటే జీవనశైలి పెద్దదైపోతోంది. చేతిలో ఉన్న డబ్బుతో బతకడం పాతకాలపు ఆలోచనగా మారుతోంది. భవిష్యత్ సంపాదనను ముందే ఖర్చు పెట్టడం ఆధునిక జీవన విధానంగా మారుతోంది. అప్పు చేసి ఇల్లు కొనడం తప్పు కాదు. కానీ అప్పు తీర్చడానికి జీవితాన్నే తాకట్టు పెట్టే పరిస్థితి వస్తే? నెల జీతం రాగానే గృహ రుణం, కారు రుణం, క్రెడిట్ కార్డు బిల్లులు.. మిగిలేది ఏమిటి? బయటికి చూస్తే లగ్జరీ జీవితం. లోపల మాత్రం ఈఎంఐల ఒత్తిడి. హైదరాబాద్ అభివృద్ధి చెందాలి. ప్రజలు మెరుగైన జీవితం కోరుకోవాలి. కానీ ఇతరులతో పోటీ పడేందుకు సంపాదనకు మించి ఖర్చు చేసే సంస్కృతి పెరగడం మాత్రం ఆలోచించాల్సిన విషయం. అంతస్థులు పెరగడం అభివృద్ధి కావచ్చు. కానీ ఆ అంతస్థుల మధ్య మనిషి మనశ్శాంతి తగ్గిపోతే.. అది ఎలాంటి అభివృద్ధి? ఇల్లు ఎంత ఎత్తులో ఉందన్నదికాదు.. ఆ ఇంట్లో నివసించే మనిషి ఎంత ప్రశాంతంగా ఉన్నాడన్నదే అసలు సంపద.

– విజయభారతి, హైదరాబాద్

# యువ మనసులో మహా సునామీ

యువత అంటే ఉత్సాహం. యువత అంటే శక్తి. యువత అంటే భవిష్యత్తుపై ఆశ. కానీ నేటి తెలంగాణ యువతను చూస్తే ఈ నిర్వచనాలు క్రమంగా మారుతున్నాయా అనిపిస్తోంది. చేతిలో చదువు ఉంది.. మెదడులో ప్రతిభ ఉంది.. కలల్లో పెద్ద లక్ష్యాలున్నాయి.. కానీ మనసులో మాత్రం అంతులేని ఒత్తిడి. ఉద్యోగం దొరుకుతుందా? జీతం సరిపోతుందా? రుణాలు ఎలా తీర్చాలి? భవిష్యత్తు ఏమవుతుంది? కుటుంబ బాధ్యతలు ఎలా నెరవేర్చాలి? పోటీ ప్రపంచంలో ఎలా నిలబడాలి? ఇలా ప్రతి రోజూ ఎన్నో ప్రశ్నలు యువతను వెంటాడుతున్నాయి. ఆ ఒత్తిడి ఇప్పుడు కేవలం మనసులోనే మిగలడం లేదు. శరీరంపైనా ప్రభావం చూపుతోంది. జుట్టు రాలడం వంటి సమస్యను చాలామంది తొలుత అందానికి సంబంధించిన సమస్యగా చూస్తారు. కానీ దాని వెనుక దాగి ఉన్న జీవనశైలి సంక్షోభాన్ని గమనించాల్సిన సమయం వచ్చింది.



**రామస్వామి చింత**
**మహబూబ్‌నగర్**

తెలంగాణ యువకుల్లో మానసిక ఒత్తిడి, నిద్రలేమి, జీవక్రియకు సంబంధించిన సమస్యలు జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉన్నాయని ట్రయా నిర్వహించిన అధ్యయనం చెబుతోంది. 29–31 ఏళ్ల పురుషుల్లో ఒత్తిడి 63.6 శాతంగా నమోదైందన్న సమాచారం నిజంగా ఆందోళన కలిగించేదే. అయితే ఇక్కడ ఒక విషయం స్పష్టంగా చెప్పాలి. జుట్టు రాలడానికి ఒత్తిడే ఏకైక కారణం కాదు. వంశపారంపర్యత, హార్మోన్ల మార్పులు, పోషకాహార లోపాలు, కొన్ని వ్యాధులు, మందుల ప్రభావం, తల చర్మ సమస్యలు, జీవనశైలి వంటి అనేక కారణాలు ఉండవచ్చు. కాబట్టి ఒక సర్వేలో కనిపించిన సంబంధాన్ని నేరుగా కారణ–ఫలితంగా నిర్ధారించడం సరైంది కాదు. కానీ ఆ సర్వే లేవనెత్తుతున్న అసలు ప్రశ్న మాత్రం చాలా పెద్దది..మన యువత ఇంత చిన్న వయసులోనే ఎందుకు ఇంత ఒత్తిడికి గురవుతోంది? ఇది కేవలం జుట్టు సమస్య కాదు. ఇది జీవన విధానం గురించి హెచ్చరిక. ఒకప్పుడు మనిషి రోజంతా శారీరకంగా శ్రమించి రాత్రి నిద్రపోయేవాడు. ఇప్పుడు గంటల తరబడి కంప్యూటర్ ముందు కూర్చోవాలి. పని సమయం ముగిసినా ఫోన్ ఆగదు. కార్యాలయం నుంచి వచ్చిన తర్వాత కూడా సందేశాలు, సమావేశాలు, సామాజిక మాధ్యమాలు, వార్తలు, వినోదం.. మెదడుకు విశ్రాంతి ఉండదు. నిద్రకు వెళ్లే సమయానికీ మొబైల్ చేతిలోనే ఉంటుంది. తెల్లవారుజామున లేచిన వెంటనే మళ్లీ అదే తెర. శరీరం మంచంపై ఉన్నా.. మెదడు మాత్రం 24 గంటలూ పరుగెడుతూనే ఉంది. ఇక ఉద్యోగ ప్రపంచంలో పరిస్థితి మరింత కఠినంగా మారింది. ఒక ఉద్యోగం కోసం వందల మంది పోటీ. ఉద్యోగం వచ్చినా నిలబడటానికి మరో పోటీ. లక్ష్యాలు, గడువులు, పనితీరు అంచనాలు, పదోన్నతుల ఒత్తిడి, ఉద్యోగ భద్రతపై అనిశ్చితి.. ఇవన్నీ యువత మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఉద్యోగం లేని యువత పరిస్థితి మరోవైపు మరింత తీవ్రమైనది. చదువు పూర్తయినా ఉపాధి దొరకకపోవడం, కుటుంబంపై ఆధారపడాల్సి రావడం, తోటి వారితో పోల్చుకోవడం.. ఇవన్నీ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. దీనికి తోడు మారిపోయిన ఆహారపు అలవాట్లు. ఇంటి భోజనం తగ్గి బయట ఆహారం పెరిగింది. సమయానికి తినడం లేదు. వ్యాయామానికి సమయం లేదు. నిద్రకు సమయం లేదు. కూర్చునే జీవనశైలి పెరిగింది. శరీరానికి కావాల్సిన విశ్రాంతి ఇవ్వకుండా నిరంతరం పని చేయించడం మొదలైంది. మనిషి తన ఫోన్‌కు రోజుకు ఎన్ని గంటలు ఇస్తున్నాడో లెక్కపెడుతున్నాడు. కానీ తన శరీరానికి ఎన్ని గంటలు ఇస్తున్నాడో మాత్రం లెక్కపెట్టడం లేదు. ఇదే అసలు విషాదం. జుట్టు రాలుతుంటే ఖరీదైన నూనెలు, షాంపూలు, సౌందర్య చికిత్సల కోసం పరుగులు తీస్తాం. కానీ రోజుకు నాలుగు గంటలే నిద్రపోతున్నామా? ఆహారం సక్రమంగా తీసుకుంటున్నామా? వ్యాయామం చేస్తున్నామా? నిరంతర ఒత్తిడిలో ఉన్నామా? అనే ప్రశ్నలు వేసుకోవడం మర్చిపోతాం. బయట కనిపించే లక్షణాన్ని తగ్గించడానికి ప్రయత్నిస్తూ, లోపల ఉన్న సమస్యను పట్టించుకోకపోతే పరిష్కారం ఎలా వస్తుంది? ఇక్కడ కుటుంబాల పాత్ర కూడా ఉంది. పిల్లలు చదువులో ముందుండాలి, మంచి ఉద్యోగం సంపాదించాలి, ఇల్లు కొనాలి, కారు కొనాలి, పెళ్లి చేసుకోవాలి, ఆర్థికంగా స్థిరపడాలి.. ఇలా ప్రతి దశలో లక్ష్యాలు పెట్టడం తప్పు కాదు. కానీ వారి మానసిక స్థితిని అడగకుండా లక్ష్యాలు మాత్రమే నిర్దేశించడం ప్రమాదకరం. "నీకు ఏమైంది?" అని అడగడానికి బదులు "ఇంకా ఎంత సంపాదించావు?" అని అడిగే సమాజం యువతను మరింత ఒత్తిడిలోకి నెట్టేస్తుంది. విద్యా సంస్థలు కూడా కేవలం మార్కులు, ఉద్యోగాల గురించే కాకుండా మానసిక ఆరోగ్యం, నిద్ర, ఆహారం, వ్యాయామం, ఒత్తిడి నిర్వహణపై అవగాహన కల్పించాలి. కార్యాలయాల్లో ఉద్యోగుల మానసిక ఆరోగ్యాన్ని కూడా పనితీరులో భాగంగా చూడాలి. రోజంతా పని చేయించడం ఉత్పాదకతకు కొలమానం కాదనే విషయాన్ని సంస్థలు గుర్తించాలి. ప్రభుత్వం కూడా ఈ సమస్యను వ్యక్తిగత సమస్యగా వదిలేయకూడదు. యువతలో మానసిక ఆరోగ్య సేవలను అందుబాటులోకి తేవాలి. కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ఉద్యోగ కేంద్రాల్లో సలహా సేవలను బలోపేతం చేయాలి. ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాలకూ తీసుకెళ్లాలి. ఎందుకంటే మానసిక ఒత్తిడి నగరాల్లో మాత్రమే ఉండదు. గ్రామీణ యువత కూడా నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ బాధ్యతలతో ఒత్తిడిని ఎదుర్కొంటోంది. అన్నింటికంటే ముఖ్యంగా యువత తన జీవితాన్ని తిరిగి తన చేతుల్లోకి తీసుకోవాలి. నిద్రను త్యాగం చేసి విజయాన్ని కొనలేం. ఆరోగ్యాన్ని పణంగా పెట్టి సంపద సంపాదించినా దాన్ని ఆస్వాదించలేం. ఇతరులతో పోల్చుకుంటూ జీవితాన్ని నడిపితే గమ్యం ఎప్పటికీ కనిపించదు. జుట్టు రాలడం కనిపిస్తున్న సమస్య కావచ్చు.. కానీ దాని వెనుక కనిపించని సమస్య మనసులోని అలసట కావచ్చు. తెలంగాణ యువత దేశంలో రెండో స్థానంలో ఉందన్న గణాంకం కంటే మనం ఆలోచించాల్సింది మరో విషయం. మన యువత ఎందుకు ఇంత ఒత్తిడిలోకి వెళ్లింది? వారికి ఉద్యోగాలు, ఉపాధి, మెరుగైన జీవన ప్రమాణాలు, విశ్రాంతి, మానసిక ప్రశాంతత కల్పించడంలో కుటుంబం, సమాజం, ప్రభుత్వం, సంస్థలు ఎక్కడ విఫలమవుతున్నాయి? యువత జుట్టును కాపాడటం మాత్రమే లక్ష్యం కాకూడదు. వారి జీవితాన్ని కాపాడాలి. వారి మనసును కాపాడాలి. వారి నిద్రను కాపాడాలి. వారి భవిష్యత్తుపై నమ్మకాన్ని కాపాడాలి. ఎందుకంటే జుట్టు రాలితే మళ్లీ పెరగవచ్చు. కానీ యువతలో ఆశ రాలిపోతే.. దాన్ని తిరిగి పెంచడం అంత సులభం కాదు.



## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.